## అధ్యాయము 25

# అబ్రాహాము యొక్క చివరి దినములు మరియు ఇస్సాకు కుటుంబము

అతని భార్యయైన కెతూరా ద్వారా పితరుని యొక్క ఇతర సంతానము, తన సొత్తును ఇస్సాకునకు విభజించుట, మరియు తన మరణము మరియు సమాధితో అనుబంధిస్తు అబ్రాహాము కథను (12:1—25:18) 25వ అధ్యాయము యొక్క మొదటి భాగము ముగిస్తుంది. హాగరు ద్వారా అబ్రాహాము కుమారుడైన, ఇష్మాయేలు వంశావళి సంక్షిప్తంగా చేర్చబడింది.

అధ్యాయము యొక్క రెండవ భాగము ఇస్సాకు కథనమును ప్రారంభిస్తుంది (25:19—28:9). చాలా సంవత్సరములు గొడ్రాలుగా ఉండిన తరువాత, ఇస్సాకు యొక్క భార్యయైన రిబ్కా మగ కవలల ద్వారా దేవునిచే దీవించబడెను. ఏదో ఒక దినము యాకోబు (ఇశ్రాయేలు) సంతతికి మరియు ఏశావు (ఎదోము) సంతతికి మధ్య జరుగబోయే వైరమును ఆమె గర్భములోని సంఘర్షణ ముందుగానే అగుపరచినది. అధ్యాయము చివరిలో, తన జేష్ఠ సహోదరుడైన ఏశావునుండి జన్మహక్కును విజయవంతంగా పొందాడు.

### కెతూరా ద్వారా అబ్రాహాము యొక్క కుటుంబము మరియు ఇస్సాకునకు స్వాస్థ్యము (25:1–6)

**1అబ్రాహాము మరల ఒక స్త్రీని వివాహము చేసికొనెను, ఆమె పేరు కెతూరా. 2ఆమె అతనికి జిమ్రాను, యొక్షాను, మెదాను, మిద్యాను, ఇష్బాకు, షూవహు అనువారిని కనెను. 3యొక్షాను షేబను దెదానును కనెను. అషూరీయులు**

**లెతూషీయులు లెయుమీయులు అనువారు ఆ దెదాను సంతతివారు. [4]ఏయిఫా ఏఫెరు హనోకు అబీదా ఎల్దాయా అనువారు ఆ మిద్యాను సంతతివారు. వీరందరు కెతూరా సంతతివారు. [5]అబ్రాహాము తనకు కలిగినది యావత్తు ఇస్సాకు కిచ్చెను. [6]అబ్రాహాము తన ఉపపత్నుల కుమారులకు బహుమానములిచ్చి, తాను సజీవుడై యుండగానే తన కుమారుడగు ఇస్సాకు నొద్దనుండి తూర్పుతట్టుగా తూర్పు దేశమునకు వారిని పంపివేసెను.**

ఇస్సాకు జననము తరువాత, వృద్ధుడైన అబ్రాహామునకు ఇంకను పిల్లలు కలిగెను. వారి తల్లియైన, కెతూరాతో, అబ్రాహాము యొక్క వివాహమును గూర్చిన వివరణలు అనిశ్చయమైనవి. ఖచ్చితంగా మనకు తెలిసినది ఏమిటంటే, వాగ్దాన పుత్రుడైన, ఇస్సాకు అబ్రాహాము యొక్క ప్రధాన వారసునిగా నిలిచిపోయెను.

**వచనము 1. కెతూరా అను పేరుగలిగిన, ఇంకొక భార్యను అబ్రాహాము ఎప్పుడు తీసుకొనెనో** ఆ కాలమును గుర్తించుటకు వాక్యము ఏ ప్రయత్నము చేయలేదు. బదులుగా, వివాహము జరిగెనని రచయిత సాధారణముగా పేర్కొనెను మరియు ఆ కలయిక ద్వారా కలిగిన సంతతి యొక్క సంక్షిప్త జాబితా ఇచ్చెను. ఆ నివేదిక స్థానము వలన, అది శారా మరణము తరువాత సంభవించెనని కొందరు విశ్వసిస్తున్నారు (23:1, 2). శారా మరణించే సమయానికి అబ్రాహాముకు 137 సంవత్సరములు మరియు కెతూరా ద్వారా ఆరుగురు పిల్లలు కలిగెను కాబట్టి, ఈ స్త్రీతో వివాహము శారాతో జీవిస్తున్నప్పుడే అయ్యుండవచ్చని కొందరు చెప్తున్నారు. ఈ సంఘటనల యొక్క కాలవృత్తాంతములు అస్పష్టముగా ఉన్నవి.

ఆదిలో వివాహము కొరకు దేవుని ద్వారా స్థాపించబడిన ఆదర్శము ఏకభార్యత్వము: ఒక పురుషునికి ఒక స్త్రీ (2:18, 21–25). అయితే, "అనేక జాతులకు తండ్రిగా" అవ్వాలన్న వాగ్దానమును నిర్వర్తించుటకు అబ్రాహాము బహుమంది భార్యలను చేసుకొనుటకు దేవుడే అనుమతించి యుండవచ్చు (17:4, 5). ఈ వచనములో, కెతూరా ఒక "భార్య"గా పిలువబడెను (25:1); కానీ తరువాత వాక్యములో "ఉపపత్ని"గా సూచింపబడెను (25:6; 1 దిన. 1:32), ఇది యాకోబు యొక్క ఉపపత్నులు బిల్హా మరియు జిల్పాల వివరణతో సమాంతరమైనది (30:4, 9; 32:22; 35:22). "ఉపపత్ని" హోదా అబ్రాహాము కెతూరాను వివాహము చేసుకున్నప్పుడు శారా బ్రతికే ఉండి ఉండవచ్చు అను ఆలోచనకు మరింత మద్దతు ఇస్తున్నది.

**వచనము 2.** కెతూరా **జిమ్రాను, మెదాను**, మరియు **ఇష్బాకు**నకు జన్మనిచ్చెను, వారిని గూర్చి మనకేమీ తెలియదు. వారి సహోదరులైన **యొక్షాను, మిద్యాను** మరియు **షూవహుతో** ఉన్న సంబంధము ఆధారముగా – వారు సాధారణముగా చుట్టుపక్కల ప్రాంతమునకు అనుబంధించబడిన మరియు అరేబియాలోని వివిధ భాగములతో బంధము కలిగియున్నారు. "యొక్షాను"

అనునది సాధారణముగా అరేబియాకు చెందినది ఎందుకనగా వారి పిల్లలైన: "షేబ" మరియు "దెదాను" (25:3) అనువారు అక్కడే స్థిరపడినారు. పశ్చిమ అరేబియా నుండి సినాయి ద్వీపకల్పములో తిరిగిన మిద్యానీయులకు, "మిద్యాను" అనువాడు మూలపురుషుడు (నిర్గమ. 2:15, 16; 3:1; సంఖ్యా. 10:12, 29–33). కొన్నిసార్లు మిద్యానీయులు పురాతన ఐగుప్తు బిడారు మార్గాలలో ఇష్మాయేలీయులతో కలిసి పనిచేసినట్టు యోసేపు యొక్క కథ తెలుపుతుంది (37:25–28, 36). "షూవహు" షూహీయులకు తండ్రియైనాడు, వారిలో ఒకడు యోబు స్నేహితుడైన బిల్దాదు (యోబు 2:11). అతను కూడా అరేబియాలోని మృత సముద్రమునకు తూర్పు ప్రాంతమునకు చెందినవాడు.[1]

**వచనము 3. షేబ** మరియు **దెదాను** అనువారు **యొక్షాను** పిల్లలుగా గుర్తింపబడిరి, కానీ వారు హాము వంశవరుసలోని రాయమా జాతులతో వచ్చినవారితో సందేహము చెందకూడదు (10:7). అదేకాక, షేము సంతతియైన ఇంకొక "షేబ" కలదు, ఆమె తండ్రి కుడా అదే పేరు కలిగి యుండెను: "యొక్తాను" (10:26, 28, 29). అబ్రాహాముతో ఉన్న తన సంబంధమును బట్టి ముందుగా చెప్పబడిన షేబ నుండి "యొక్షాను" కుమారుడైన "షేబ"ను పేరుపరచవలెను.

**అషూరీము లెతూషీము లెయుమీము అనువారు దెదాను కుమారులు.** వాస్తవముగా వారి పేర్ల చివరి భాగాన హెబ్రీ బహువచనము ఉన్నది (ִים, *-im*) గనుక ఇవి వ్యక్తిగత పేర్లను సూచించుట లేదు, కానీ దెదాను యొక్క వారసులు తెలుపబడే తెగల పేర్లు.[2] ఈ "అషూరీము" ఉత్తర మెసొపొతమియలో గల అష్షూరు సామ్రాజ్యమునకు వ్యవస్థాపకులు కాదు (10:11, 12). వారు సంఖ్యా. 24:22, 24లో "అష్షూరు" అని పిలువబడిన అరేబియాలోని ఒక ఎడారి తెగకు చెందినవారు కావచ్చు.[3] "లెతూషియులు" మరియు "లెయుమీయులు" గూర్చి ఖచ్చితమైన సమాచారం లేదు; కాని, వారు అబ్రాహాము సంతతివారు కాబట్టి, ఆయన నుండి అనేక దేశములు వచ్చునని దేవుడు చేసిన వాగ్దానమునకు నెరవేర్పుగా వారు కూడ అంతగా పేరు లేని అరేబియా తెగలు కావచ్చు.

**వచనము 4. ఏయిఫా, ఏఫెరు, హనోకు, అబీదా, మరియు ఎల్దాయా** అనువారు మిద్యాను ద్వారా అబ్రాహాముకు కలిగిన మనవళ్లు. మొదటిగా "ఏఫాయి," యెషయా 60:6లో బబులోను చెర నుండి తిరిగివస్తున్న యూదా ప్రజలకు బంగారము మరియు బోళమును తీసుకొనివచ్చిన మిద్యాను మరియు షెబాకు చెందిన ఒంటెల వర్తకులతో అనుబంధం కలిగియున్నాడు. మిద్యాను యొక్క తరువాతి నల్గురును గూర్చిన వివరణ మనకు లేకపోయినప్పటికీ, వారు ప్రాచీన వాయువ్య అరబీ తెగలకు చెందినవారిగాను, ప్రాచీన రవాణా మార్గాల వద్ద ఉన్న పట్టణాలలో కాని, నీటి ఊటల వద్ద కాని స్థిరపడి ఉండవచ్చు.

**వచనములు 5, 6.** అబ్రాహాము యొక్క అసలైన వారసుడు **ఇస్సాకే**; కనుక, ఇస్సాకు తన తండ్రి యొక్క సంపదలు **అన్నిటినీ** పొందుకొనెను (24:36

చూడుము), కాని అతని **ఉపపత్నుల** (హాగారు మరియు కెతూర) **కుమారులకు** వాటిపై ఎటువంటి హక్కు లేదు. హమ్మురాబి స్మృతి నందు కల చట్టం ప్రకారం, ఒక తండ్రి తన ఉపపత్నుల కుమారులను తన ప్రాథమిక భార్యకు పుట్టిన కుమారులతో సమానముగా చూడకపోయిననూ, ఆ ఉపపత్నుల కుమారులు తమ తండ్రి మరణానంతరం ఆస్తిపై ఎటువంటి హాక్కు లేనివారగుదురు.[4] ఇష్మాయేలు విషయములో అబ్రాహాము అతడిని తన చట్టబద్ధమైన వారసునిగా అంగీకరించినట్లుగా కనబడును (16:15; 17:18). ఏదైనప్పటికీ, తరువాత అతడిని తన తల్లియైన హాగారుతో పాటుగా, తన ఇంటిలో ఇస్సాకు యొక్క స్థానమునకు ఎటువంటి భంగము కలుగకుండగా బయటకు పంపివేసెను (21:10–14). ఈ కఠినమైన చర్య ద్వారా, అబ్రాహాము ఇష్మాయేలును వారసుని స్థానము నుండి తొలగించెను. ఇస్సాకు వాగ్దాన పుత్రునిగా స్థిరపరచబడెను కనుక, కెతూర (ఉపపత్ని) యొక్క కుమారులు ఎన్నడూ అబ్రాహామునకు వారసులుగా గుర్తించబడలేదు. వారందరూ ఒక తక్కువ స్థాయిని కలిగిన వారై తమ తండ్రి యొక్క మంచితనముపై ఆధారపడిరి. కనుక, తన ఆస్తిలో భాగము కాక **అబ్రాహాము బ్రతికియుండగానే వీరికి బహుమానములు ఇచ్చెను.**

అబ్రాహాము ఒకవేళ తన మరణము తరువాత అతని కుమారులు ఇస్సాకు యొక్క వారసత్వమును తీసుకొనే ప్రయత్నము చేయుదురేమో అనే ఆలోచనతో, అబ్రాహాము **వారినందరినీ తన కుమారుడైన ఇస్సాకు నుండి ... తూర్పు దేశమునకు పంపెను.** "పంపివేసెను" (שָׁלַח, *shalach*) అను పదము, హాగరును "పంపివేసినపుడు" (21:14) ఒకే పదము హెబ్రీ భాషలో వాడబడెను. ఇక్కడ ఈ పదము, "తూర్పు" (קֶדֶם, *qedem*) అనే మరొక పదముతో కలిపి వాడుట, ఆ కార్యము శాశ్వతమైనదిగా తేయజేయుచున్నది. ఈ భాషా ప్రయోగము ఏదేను తోట నుండి దేవుడు ఆదాము అవ్వలను పంపివేయుటను చూపిస్తుంది. ఇదేరీతిగా, దేవుడు కయీనును కూడా ఆ ప్రదేశమునుండి ఒక గుర్తు అతనికి వేసి, నీవు దేశదిమ్మరివై ఉందువని పంపివేసెను. ఈ రెండు సందర్భాలలో కూడా వీరిరువురునూ తూర్పువైపునకే పంపబడిరి (3:23, 24; 4:14, 16).

## అబ్రాహాము యొక్క మరణము మరియు పాతిపెత్తబడుట (25:7–11)

**7 అబ్రాహాము బ్రదికిన సంవత్సరములు నూటడెబ్బదియైదు. 8 అబ్రాహాము నిండు వృద్ధాప్యమునకు వచ్చినవాడై మంచి ముసలితనమున ప్రాణము విడిచి మృతిబొంది తన పితరులయొద్దకు చేర్చబడెను. 9 హితీయుడైన సోహరు కుమారుడగు ఎఫ్రోను పొలమందలి మక్పేలా గుహలో అతని కుమారులగు ఇస్సాకును ఇష్మాయేలును అతనిని పాతిపెట్టిరి; అది మమ్రే యెదుటనున్నది. 10 అబ్రాహాము హేతు కుమారునియొద్ద కొనిన పొలములోనే అబ్రాహామును అతని భార్యయైన శారాయును**

**పాతిపెట్టబడిరి. [11]అబ్రాహాము మృతిబొందిన తరువాత దేవుడు అతని కుమారుడగు ఇస్సాకును ఆశీర్వదించెను; అప్పుడు ఇస్సాకు బేయేర్ లహాయిరోయి దగ్గర కాపురముండెను.**

**వచనములు 7, 8. అబ్రాహాము కడు వృద్ధాప్యము వరకు నూటడెబ్బదియైదు సంవత్సరములు** జీవించెను. అనగా అతడు తన మరణానికి ముందు కనానులో వంద సంవత్సరములు జీవించెను (12:4 చూడుము). దేవుడు అబ్రాహామునకు దీర్ఘాయువును వాగ్దానము చేసెను (15:15), ఆ దేవుని మాట నెరవేరెను. అంత భౌతిక దీర్ఘాయువును ఇచ్చుటను బట్టి దేవుడు అబ్రాహామును ఎంతో గొప్పగా దీవించెనని తెలియును, అయితే, ఎక్కువ కాలం జీవించుట మరియు ఎక్కువ కాలము *సంతోషముగా* బ్రతుకుటకు చాలా వ్యత్యాసము కలదు. అబ్రాహాము యొక్క సంస్మరణ సమాచారము ద్వారా, అతడు "కడు వృద్ధాప్యం" వరకు జీవించుటే కాక తన **జీవితమును బట్టి తృప్తి పొందెను.** విశ్వాసులకు తండ్రియైన అబ్రాహాము క్షేమకరమైన, తృప్తి, నెమ్మదితో కూడిన జీవితమును కలిగి జీవించెను.

అబ్రాహాము యొక్క మరణమును గూర్చి మూడు అభిప్రాయములు ఉపయోగింపబడెను: **తన చివరి శ్వాసను విడచి,** మంచి "ముసలితనమున" **మరణించి**, తన **పితరులతో చేర్చబడెను.** చివరి మాట యొక్క భావము సందేహముతో కూడినది. (1) ఇది సాధారణంగా ఒక వ్యక్తి చనిపోవుటను సూచించును, ఈ సందర్భములో, రచయిత అబ్రాహాము యొక్క మరణమును మూడు విధాలుగా వివరించెను. (2) అబ్రాహాము యొక్క దేహము మక్పేల గుహనందు తన పితరులతో కూడా పాతిపెట్టబడెను అనే అర్థమునిచ్చును. కాని, తరువాతి వచనములో వ్రాయబడిన విధమును బట్టి, దాని అర్థము ఇక్కడే ఉపయోగించవలెను. (3) ఈ మాట, మరణ సమయములో ఏమి జరిగేనో తెలుపుచున్నది. అబ్రాహాము యొక్క ఆత్మ అతని శరీరమును విడిచి, తమ పితరులను కలుసుకొనుటకు మృతుల లోకమునకు వెళ్లెను అనే అర్థమును ఇచ్చును. పితరుల కాలములో వారు మరణము తరువాత జీవితమును గుర్చిన నమ్మికను గుర్చిన నమూనాగా ఈ మాట కనిపించును. అందుకే హెబ్రియులకు వ్రాసిన పత్రికలో రచయిత వారికున్న ఈ నిరీక్షణను గూర్చి: "వారు మరి శ్రేష్ఠమైన దేశమును" వారి మరణానంతరం కోరుకోనుచున్నారు (హెబ్రీ. 11:13–16).

**వచనములు 9, 10.** అబ్రాహాము యొక్క మరణము ఇద్దరు సహోదరులను అనగా **ఇస్సాకు మరియు ఇష్మాయేలులను** అనేక సంవత్సరముల తరువాత తిరిగి దగ్గరకు తీసుకొని వచ్చెను. గతంలో ఒకరిపై ఒకరు కలిగియున్న ప్రతీ విధమైన ద్వేషమును వారు మరచి, వారి తండ్రి వారికి పంచిన ప్రేమను బట్టి (17:18; 21:9–12; 22:2), వారిరువురూ కలిసి హెబ్రోనులో అబ్రాహామును పాతిపెట్టిరి.[5] అబ్రాహాము **హిత్తీయుడైన ఎఫ్రోను ... మక్పేలా గుహను** శ్మశాన భూమిగా ఎట్లు

కొనెనో మోషే వివరించెను (23:1–20 చూడుము). ఆ ఇద్దరు కుమారులు తమ తండ్రిని అతనికి (ప్రియమైన) **భార్యయయిన శారాతో పాతిపెట్టిరి** (23:19 చూడుము).

**వచనము 11. అబ్రాహాము మరణము** తరువాత, ఆ దైవిక ఆశీర్వాదములు **ఇస్సాకునకు** జారీ అగుట మనకు ఇక్కడ కనబడును. కానీ, అబ్రాహాము ఎప్పుడునూ ఈ ఆశీర్వాదములను తన నోటితో పలుకలేదు. కాని, తరువాత యాకోబు, తన తండ్రి యొక్క కనుద్రుష్టి మందగించుటను బట్టి, తానే ఏశావునని తండ్రిని మోసగించి, దీవెనలు పొందెను (27:18–29).

**దేవుడు** "అబ్రాహామును అన్ని విషయములల దీవించిన" రీతిగానే (24:1), **బెయేర్ లహాయిరోయిలో** కాపురమున్న అతని కుమారుడైన **ఇస్సాకును కూడా దీవించెను** (24:62). ఇదే స్థలములో యెహోవా దూత శారా యొక్క కోపమునకు పారిపోవుచున్న హాగారును కలుసుకొనెను. ఆ పరలోక దూత ఆమెను తిరిగి తన యజమానురాలి యొద్దకు వెళ్లమని చెప్పి, ఆమెకు ఇష్మాయేలు అనే కుమారుడు పుట్టుననియు, అతడు అనేకులకు పితరుడుగా ఉండునని చెప్పెను (16:7–11). ఇస్సాకు బెయేర్ లహాయిరోయిలో కాపురముండుటకు గల కారణము, అతడు ఇష్మాయేలును అబ్రాహాము నుండి వచ్చే దైవిక ఆశీర్వాదముల నుండి తప్పించుటకు మాత్రమే కాక ఆ ప్రదేశము నుండి అతనిని స్థానభ్రంశం చేసెను.

## ఇష్మాయేలు యొక్క సంతాను (25:12–18)

**12ఐగుప్తీయురాలును శారా దాసియునైన హాగరు అబ్రాహామునకు కనిన అబ్రాహాము కుమారుడగు ఇష్మాయేలు వంశావళి యిదే. 13ఇష్మాయేలు జ్యేష్ఠకుమారుడైన నేబాయోతు కేదారు అద్బయేలు మిబ్శాము 14మిష్మా దూమానమశ్శా 15హదరు తేమా యెతూరు నాపీషు కెదెమా 16ఇవి వారి వారి వంశవళుల ప్రకారము వారి వారి పేరుల చొప్పున ఇష్మాయేలు కుమారులయొక్క పేరులు వారి వారి గ్రామములలోను వారి వారి కోటలలోను ఇష్మాయేలు కుమారులు వీరే, వారి పేరులు ఇవే, వారివారి జనముల ప్రకారము వారు పండ్రెండుగురు రాజులు. 17ఇష్మాయేలు బ్రదికిన సంవత్సరములు నూట ముప్పది యేడు. అప్పుడతడు ప్రాణమువిడిచి మృతిబొంది తన పితరుల యొద్దకు చేర్చబడెను. 18వారు అష్షూరునుకు వెళ్లు మార్గమున హవీలా మొదలుకొని ఐగుప్తు ఎదుటనున్న షూరువరకు నివసించువారు అతడు తన సహోదరులందరి యెదుట నివాస మేర్పరచు కొనెను.**

"శారా దాసియైన," "ఐగుప్తురాలైన హాగరు" కనిన పితరుని కుమారుడు ఇష్మాయేలని చదవరులకు ఈ భాగం జ్ఞాపకం చేస్తుంది. 16:1–4 నందు వ్రాయబడినట్టు, శారా గొడ్రాలైనందున, అబ్రాహామును తన దాసీయైన హాగారుతో

వెళ్లమని, ఆమె ద్వారా పుట్టిన కుమారుని తమ వారసునిగా భావిస్తామని కోరెను. కాని, హాగారు, ఇష్మాయేలులు బయటకు పంపివేయబడిరి (21:8–21). అయినను, ఇష్మాయేలు అబ్రాహాము యొక్క కుమారుడే; ఇస్సాకు యొక్క కుటుంబ చరిత్రను తెలుపక ముందే రచయిత ఇష్మాయేలు యొక్క వారసులను గూర్చి తెలియజేసి, దేవుడు హాగారుకు ఇచ్చిన తన వాగ్దానమును ఎట్లు నెరవేర్చెనో తెలియజేసెను (16:10, 11).

**వచనము 12.** ఈ భాగములో **ఇష్మాయేలు యొక్క వంశావళిని** [תוֹלְדוֹת, *toledoth*] చూపిస్తూ, **హాగరు** ద్వారా **అబ్రాహాము** యొక్క [పెద్ద] **కుమారుని** యొక్క చివరి వివరములు తెలియజేయబడెను. అబ్రాహామునకు కెతూరా ద్వారా కలిగిన ఆరుగురు కుమారులను గుర్చిన ఈ భాగాములోనే, ఇష్మాయేలు యొక్క కుమారులను గూర్చియు, అతని మరణమును గూర్చియు తెలిపుటకు ఇది తగిన సమయము (25:1–11).

**వచనములు 13–15.** అబ్రాహాము హాగరులకు ఇష్మాయేలు ఒక్కడే కుమారుడైనా అతనికి చాలా మంది పిల్లలున్నారు. అతనికి పండ్రెండుగురు కుమారులు పుట్టారు; తదుపరి కాలంలో ఆదికాండములో యాకోబు ప్రాముఖ్యంగా కనబడుతున్నప్పటికీ, ఈ సంఖ్య యాకోబు కుమారుల సంఖ్యకు సరిసమానంగానే ఉంది. అరబ్బు తెగల్లో అనేకమంది ఇష్మాయేలు కుమారుల సంతతివారేననే అభిప్రాయం కూడా ఉంది. ఈ కారణం చేతనే, ఇశ్రాయేలీయుల్లోని పండ్రెండు గోత్రాల్లాగానే, ఇష్మాయేలీయులు కూడా పండ్రెండు తెగల సమాఖ్యగా ఏర్పడ్డారని కొందరి అభిప్రాయం. అయితే ఇది కచ్చితమైన సమాచారమేనని చెప్పలేం. అరేబియాలోని యాతనపెట్టే నిర్జల వాతావరణం, తెగలన్నీ ఒకే చోట కలిసి ఉండడంకంటె, అక్కడక్కడా చెదరి ఉండడానికే ఎక్కువ అనుకూలంగా ఉంటుంది. ఇటీవలి కాలంవరకు, అరబ్బు ప్రజల సాధారణ జీవనశైలి పూర్తిగా కాకపోయినా చాలా మటుకు సంచారజీవనశైలియే; వీరు మందలకొరకు నీటిని మేతను వెతుక్కుంటూ ఒక చోటునుండి మరొక చోటుకు తరలి వెళ్లే సంచారప్రజలే. తక్కినవారు ప్రాచీన పశ్చిమాసియాలో సార్థవాహులు (బిడారులు, వర్తక బృందాలు) ప్రయాణించే మార్గాల్లో నిరంతరం అటూ ఇటూ సంచరిస్తూ ఉండేవారు.

**ఇష్మాయలు కుమారులయొక్క పేరులు** వారి **వంశావళి** ప్రకారం, అంటే వారు జన్మించిన వరుస ప్రకారం **జ్యేష్ఠకుమారుడైన నేబాయోతు**తో మొదలవుతాయి. సరిగ్గా ఇదే వంశావళి 1 దిన. 1:29–31 వచనా ల్లోనూ కనబడుతోంది. తర్వాత, ఇష్మాయేలుకు కుమార్తెలూ నేబాయోతుకు సోదరీమణులూ అయిన మహలతును (28:9) బాశెమతును (36:3) ఏశావు వివాహం చేసుకున్నట్టు వాక్యభాగం తెలియజేస్తోంది.[6] క్రీస్తు పూర్వం నాల్గవ శతాబ్దం చివర్లో ఎదోమీయుల్ని ఓడించిన నెబాతీయులైన అరబ్బులకు మూల పురుషుడు "నెబాయోతు" అనే అభిప్రాయమున్నప్పటికీ, వీరికి నెబాయోతుకు మధ్య ఉన్న సంబంధం గురించి

కచ్చితంగా చెప్పలేం.

**కేదారు** అనే పేరు తదుపరి కాలంలో యుద్ధతత్పరత కలిగిన ప్రజలకు సంబంధించిన పేరుగా యెషయా 21:16, 17 వచనాల్లో కనబడుతుంది. "కేదారు" గురించి ఇతర ప్రస్తావనలు యెషయా 42:11 మరియు 60:7 వచనాల్లో ఉన్నాయి, ఇతని వంశస్థులకు చెందిన నివాసగ్రామాల వివరాలు నెబాయోతు వంశానికి సంబంధించినవనే ప్రస్తావన కనబడుతోంది (యిర్మీయా 2:10; 49:28; యెహెజ్కేలు 27:21 చూడండి).

**అద్బయేలు** మరియు **మిబ్శాము** గురించి ఇక్కడ ఒక్కచోట మరియు 1 దిన. 1:29 వచనంలో మాత్రమే కనబడుతోంది. "అద్బయేలు" అనే పేరు, అరేబియాలోని వాయవ్య ప్రాంతంలో అష్షూరు రాజైన మూడవ తిగ్లత్పిలేసరు (క్రీస్తు పూర్వం 745–727) ఓడించిన అరబ్బు ప్రజలకు చెందిన *Idiba'ilu* (*ఇదిబ-ఈలు*) అనే వ్యక్తిగత నామంగాను మరియు తెగ నామంగాను మళ్లీ కనబడుతుంది.[7] "మిబ్శాము" అనే పేరుకు בֹּשֶׂם (*bośem*) హెబ్రీ మూలం నుండి "సుగంధం" అనీ లేక "లేపనం" అనీ అర్థం. ఈ పేరు అనంతర కాలంలో, యాకోబు కుమారుల్లో ఒకడైన షిమ్యోను వంశస్థుల వంశావళికి చెందినదిగా కనబడుతుంది (1 దిన. 4:25). ఇష్మాయేలు కుమారుడైన ఇతని గురించి ఇది తప్ప ఇతర వివరాల్లేవు.

**మిష్మా** విషయంలో కూడా ఇటువంటిదే తెలుస్తోంది; తదుపరికాలంలో షిమ్యోను గోత్రంలోని మిబ్శాము కుమారుడిగా ఈ పేరు కనబుతుంది (1 దిన. 4:25). అరేబియాలో నీటి చెలమ (ఒయాసిస్) ఉన్న తెమా పట్టణానికి తూర్పువైపు సుమారు నూట అరవై మైళ్ల దూరంలో ఉన్న జెబెల్ మిస్మా అనే పర్వతప్రాంతమే నాటికాలంలో మిష్మా మరియు అతని వంశస్థులు (సంతతివారు) స్థిరపడిన నివాసగ్రామమని కొందరి అభిప్రాయం; అయితే దీని గురించి కచ్చితమైన అభిప్రాయం గానీ నిర్దిష్టమైన గుర్తింపుగానీ లేదు.

తర్వాత **దూమా** ప్రస్తావన ఉంది. ఈ పేరు మళ్లీ తదుపరి కాలంలో యెషయా ప్రవచనంలో (యెషయా 21:11, 12; NIV; NRSV; ESV) కనబడుతుంది; దూమా[8] ఇక్కడ ఎదోములో ఒక భాగమనే ప్రస్తావన ఉంది. అష్షూరు రాజు అరబ్బులమీద ఐగుప్తీయులమీద చేసిన దండయాత్రల్లో భాగంగా అతను జయించిన అరబ్బుల స్థావరమైన "అదుమట్టు" దూమాకు సంబంధించిందిగా అనేకులు అభిప్రాయం.[9]

ఇష్మాయేలు కుమారుల్లో ఒకరి వ్యక్తిగత నామమైన **మశ్శా**, హెబ్రీలో "భారం" అనీ, లేక "భవిష్య వాణి" (దేవోక్తి) అనే అర్థాన్నిస్తుంది. ఇది ఒక స్థలనామం కావచ్చనీ (NJB; NJPSV; REB చూడండి; వీటిలో మశ్శాకు చెందిన యాకె అని ఉన్నట్టుగా) సామెతలు 30:1 సూచిస్తోంది. అష్షూరు చారిత్రక వృత్తాంతాల ప్రకారం, అరేబియాలోని "మశ్శా" అనే పట్టణానికి తేమాకు చాలా దగ్గర సంబంధం ఉందని తెలుస్తోంది.[10]

**హదదు** అనే పేరు ఇక్కడా, మరియు 1 దిన. 1:30లోను కనబడుతుంది;

అయితే అనంతర కాలంలో ఏశావు వంశస్థులు కూడా ఇదే పేరు నుపయోగించడం జరిగింది (36:35, 36; మరియు 1 రాజులు 11:14–25; 1 దిన. 1:46–51 చూడండి). చివరకు, హదదు అనే పేరు ప్రాచీనకాలంలో ప్రజాబాహుళ్యంలో సర్వ సాధారణమైన సెమిటిక్ నామంగా ఉండేది కాబట్టి, ఇది సూటిగా ఇష్మాయేలు వంశానికి గానీ లేక ఏశావు వంశానికి గానీ చెందిందని నిరూపించడం కష్టం కాబట్టి, వివిధ జాతుల్లో సర్వసాధారణంగా కనిపించే పేర్లు చారిత్రకపరంగా వారి పూర్వికులు ఒకరే అయ్యుండవచ్చని తప్ప మరే వివరాల్ని నిర్దిష్టంగా తెలియజేయవు.

వాయవ్య అరేబియాలో నీటి చెలమ (ఒయాసిస్) ఉన్న ముఖ్యప్రాంతానికి **తేమా** అనే పేరు ఉండేది (ఆధునిక తామా). ఈ ప్రాంతం ప్రాచీన కాలంనుండి వాణిజ్యమార్గాలకు కూడలిగా ఉండేది. ఇది షేబతోను (యోబు 6:19), తర్వాత దెదాను తోను (యెషయా 21:13, 14; యిర్మీయా 25:23) జంటగా ప్రస్తావించ బడింది. పైగా, బబులోను రాజైన నబోనిడస్ కుమారుడైన బెల్షస్సరు సామ్రాజ్యపు చివరి కాలంలో బబులోను నుండి పరిపాలించగా (దానియేలు 5:1–30 చూడండి), బబులోను రాజైన నబోనిడస్ (క్రీస్తు పూర్వం 556–539) తేమాలో పది సంవత్సరాలు నివసించడం జరిగింది.

**యెతూరు** మరియు **నాపీషు** యొర్దాను అవతల ఉత్తరభాగంలో స్థిరపడ్డారు; అయితే నిర్దిష్టమైన ప్రదేశంగురించి ఏకాభిప్రాయం లేదు. ఇశ్రాయేలీయులు కనాను దేశాన్ని స్వాధీనంచేసుకోడానికి సన్నద్ధమవు తున్నప్పుడు, యొర్దాను అవతల తూర్పువైపున రూబేను గాదు గోత్రాలు మనష్షే అర్ధగోత్రం చేసిన దాడిలో అక్కడున్న "యెతూరు" మరియు "నాపీషు" వంశస్థులు ఘోరంగా ఓడిపోవడం జరిగింది (1 దిన. 5:18–22). క్రీస్తు శకం మొదటి శతాబ్దంలో, పాలస్తీనాకు ఉత్తరంలోను లెబానోను పర్వతానికి తూర్పువైపున నివసించిన ఇతూరయ ప్రాంతవాసుల పూర్వికులు యెతూరు మరియు అతని వంశస్థులేనని అనేకులు నమ్మేవారు (లూకా 3:1).

**కెదెమా** అనే వ్యక్తిగత నామం బైబిల్లో ఇక్కడా మరియు 1 దిన. 1:31 వచనంలో మాత్రమే కనబడు తుంది. קֵדְמָה (*qed^emah*) అనే హెబ్రీ పదానికి "తూర్పువైపు" అనీ, లేక "తూర్పువాసులు" అనీ అర్థం (13:14; 28:14 చూడండి). యాకోబు "తూర్పు జనుల దేశమునకు" బయలుదేరి వెళ్లాడనే సందర్భంలో (29:1), అతను ఇష్మాయేలు కుమారుడైన కెదెమా వంశస్థుల్నే ఎదుర్కొని ఉండవచ్చని కొందరి అభిప్రాయం. ఏదేమైనా, ఈ పదప్రయోగం లేక భాషాప్రయోగం (తూర్పు జనులు) సర్వసాధారణంగా కనానుకు ఈశాన్యంలో హారానులో నివసించిన ప్రజల్ని సూచిస్తోంది (29:4). "తూర్పుజనుల"లోని పలుజాతులకు చెందినవారు కూడా ("కద్మోనీయులు"; 15:19) కనాను దేశంలో నివసించారు.

**వచనము 16.** ఇష్మాయేలు **కుమారుల** యొక్క పేర్లను వివరించిన తర్వాత, రచయిత అతని వంశస్థులు ఏ యే ప్రదేశాల్లో నివసించారో వివరించాడు. కొందరు తమతో సత్సంబంధాలున్న పట్టణాల సమీపంలో, ప్రాకారాల్లేని పల్లెప్రాంతాలైన

**గ్రామములలో** (חָצֵר, *chatser* నుండి) నివసించారు (లేవీయ. 25:31; ద్వితీ. 2:23; యెహోషువ 19:8 చూడండి). మరికొందరు కూడా పట్టణాలకు అతిసమీపంలో ఉన్న **కోటలలో** (טִירָה, *tirah* నుండి) నివసించారు (సంఖ్యా. 31:10; యెహెజ్కేలు 25:4) చూడండి). ఈ "కోటలు" (NRSV; NEB; NJPSV పేర్కొన్నట్టుగా) ఎత్తైన రాతి గోడలున్న శిబిరాల వంటివి.[11] కాలక్రమంలో, ఇష్మాయేలు యొక్క పండ్రెండుగురు కుమారులు పండ్రెండుగురు రాజులై (נָשִׂיא, *naśi'* నుండి; తెగ నాయకుడు, వంశనాయకుడు) పండ్రెండు వంశాలవారయ్యారు.

**వచనము 17.** ఇష్మాయేలు **నూట ముప్పది యేడు సంవత్సరాలు** జీవించి, **అప్పుడతడు ప్రాణము విడిచి మృతిబొంది తన పితరులయొద్దకు చేర్చబడెను** అని అతని జీవితంగురించి ఆదర్శప్రాయమైన (లాంఛనప్రాయమైన, విలక్షణమైన) సారాంశాన్ని రచయిత తెలియజేశాడు. ఇష్మాయేలు మరణంగురించి ఉన్న వర్ణనను అతని తండ్రి అబ్రాహాము మరణం గురించి ఉన్న వర్ణనతో పోల్చి చూచినప్పుడు (25:7, 8), ఇష్మాయేలుకు అతని వంశస్థులకు బైబిలు చరిత్రలో ప్రముఖస్థానం ఉందని సూచనాత్మకంగా తెలుస్తోంది. పైగా, యెహోవా దూత హాగరుతో చేసిన వాగ్దానం ప్రకారం (16:10, 11), ఇష్మాయేలు కుమారుల సంఖ్య (పండ్రెండుగురు) మరియు అతని జీవితకాలం (137 సంవత్సరాలు) అతనికి దేవుని ఆశీర్వాదాలున్నాయని రూఢిగా సాక్ష్య మిస్తున్నాయి.

**వచనము 18.** ఇష్మాయేలు వంశస్థులు **హవీలా మొదలుకొని ... షూరు వరకు నివసించువారు** అని మోషే వర్ణించడం జరిగింది. షూరు బహుశా ఐగుప్తు మార్గంలో సీనాయి ఉత్తరభాగంలో కనానుకు నైరుతి దిశలో ఉన్న ప్రాంతం కావచ్చు. హాగరు ఈ ప్రాంతానికి ప్రయాణం చేసేటప్పుడే మొదటిసారి యెహోవా దూత ఆమెకు ప్రత్యక్షమయ్యాడు (16:7 వివరణలు చూడండి). హవీలా బహుశా అరేబియాలోని ఏదో ఒక ప్రాంతాన్ని సూచిస్తుండవచ్చు (2:11, 12 వివరణలు చూడండి). ఈ రెండూ, **అష్షూరునకు వెళ్లు మార్గమున ... ఐగుప్తు ఎదుట** ఉన్నాయి. ఇక్కడ అష్షూరు గురించి ఉన్న ప్రస్తావన, మెసొపొతమియలో ఈశాన్య ప్రాంతంలో ఉన్న అష్షూరు అని అర్థం చేసుకొనకూడదు; ఈ సందర్భంలోని అష్షూరు బహుశా సీనాయి ద్వీపకల్పంలోని లేక అరేబియాలోని ఏదైనా ఒక ప్రాంతాన్ని సూచిస్తుండవచ్చు (25:3 వివరణలు చూడండి).

ఇష్మాయేలు **తన సహోదరులందరియెదుట నివాసమేర్పరచుకొనెను** అని ముగింపులో ఉన్న మాటలు తెలియజేస్తున్నాయి. עַל־פְּנֵי (*'al p^e ney*) అనే హెబ్రీ భావప్రకటనకు అక్షరాలా "వారి ముఖం యెదుట" అని అర్థం. ఇష్మాయేలు తన దాయాదుల నడుమ "తిరస్కారపూర్వకంగా" (NASB), లేదా "విరోధ భావంతో" (NIV) నివసించాడని కొన్ని బైబిలు ప్రతులు తెలియజేస్తున్నాయి. "తిరస్కారం" లేదా "విరోధ భావం" అనే మనోవైఖరి (అంతర్గతమైన మానసిక లక్షణం), 16:12 వచనంలో "అతని చెయ్యి అందరికిని ... విరోధముగా ఉండును" అని

జరగబోయేదాన్ని సూచించిన భవిష్యసందేశంతో ఏకీభవిస్తుంది (సరిపడు తుంది). ఇష్మాయేలు బహుశా ముక్కోపి (చిన్న విషయాలకే చిరాకుపడే లేక చిరచిరలాడే మనస్తత్వం) అయ్యుండవచ్చు, ఈ మోటుతనంతో అతను అపరిచితుల పట్ల (లేదా పరదేశుల పట్ల) మాత్రమే కాక, తన స్వంత పిల్లల పట్ల తన కుటుంబీకులపట్ల కూడా ఘర్షణపడే నైజాన్ని లేదా పోట్లాడే స్వభావాన్ని చూపించి ఉండవచ్చు. మరి కొన్ని బైబిల్ ప్రతులు (NRSV; NJPSV) తన ప్రజలందరి ప్రక్క ప్రక్కనే నివసించి ఉండ వచ్చని తెలియజేస్తున్నాయి, ఇది వారి మధ్య సామరస్యపూర్వకమైన సంబంధాలున్నట్టుగా సూచిస్తోంది. "యెదుట" అనే పదం ఇష్మాయేలు నివసించిన ప్రదేశం లేదా కోట అతని వంశస్థులు నివసించిన ప్రదేశానికి అభిముఖంగా (అంటే "తూర్పువైపు" లేక ఎదురుగా – NEB) ఉందనే భావాన్ని కూడా సూచిస్తోంది. "అతడు తన సహోదరులందరి యెదుట (తూర్పు వైపు) నివసించునని" 16:12, NASBలో ఉన్నట్టుగానే హెబ్రీ వాచక శైలిలో కూడా కనిపిస్తుంది.

## ఏశావు యాకోబుల జననం (25:19–26)

**[19]అబ్రాహాము కుమారుడగు ఇస్సాకు వంశావళి యిదే. అబ్రాహాము ఇస్సాకును కనెను. [20]ఇస్సాకు పద్దనరాములో నివసించు సిరియావాడైన బెతూయేలు కుమార్తెయును సిరియావాడైన లాబాను సహోదరియు నైన రిబ్కాను పెండ్లిచేసికొన్నప్పుడు నలుబది సంవత్సరములవాడు. [21]ఇస్సాకు భార్య గొడ్రాలు గనుక అతడు ఆమె విషయమై యెహోవాను వేడుకొనెను. యెహోవా అతని ప్రార్థన వినెను గనుక అతని భార్యయైన రిబ్కా గర్భవతి ఆయెను. [22]ఆమె గర్భములో శిశువులు ఒకనితో నొకడు పెనుగులాడిరి గనుక ఆమె–ఈలాగైతే నేను బ్రదుకుట యెందుకని అనుకొని యీ విషయమై యెహోవాను అడుగ వెళ్లెను. అప్పుడు యెహోవా ఆమెతో నిట్లనెను–**

**[23]రెండు జనములు నీ గర్భములో కలవు.**
**రెండు జనపదములు నీ కడుపులోనుండి**
**ప్రత్యేకముగా వచ్చును.**
**ఒక జనపదముకంటె ఒక జనపదము**
**బలిష్ఠమై యుండును.**
**పెద్దవాడు చిన్నవానికి దాసుడగును**
**అనెను.**

**[24]ఆమె ప్రసూతి కావలసిన దినములు నిండినప్పుడు ఆమె గర్భమందు కవలవారు ఉండిరి. [25]మొదటివాడు ఎఱ్ఱనివాడుగా బయటికి వచ్చెను. అతని ఒళ్లంతయు రోమవస్త్రమువలె నుండెను గనుక అతనికి ఏశావు అను పేరు పెట్టిరి.**
**[26]తరువాత అతని సహోదరుడు బయటికి వచ్చినప్పుడు అతని చెయ్యి ఏశావు**

**మడిమెను పట్టుకొని యుండెను గనుక అతనికి యాకోబు అను పేరు పెట్టబడెను. ఆమె వారిని కనినప్పుడు ఇస్సాకు అరువది యేండ్లవాడు.**

ఇష్మాయేలు వంశస్థుల గురించి చర్చించిన తర్వాత, వాక్యభాగంలో కథాగమనం మళ్లీ ఇస్సాకు వైపు తిరిగి, ఆదికాండములో ఇక మిగిలిన భాగమంతా నిరాటంకంగా అతని (ఇస్సాకు) వంశం గురించే తెలియ జేస్తుంది. క్రొత్త జాతులకు మూలపురుషులు జన్మించడంతో దేవుడు అబ్రాహాముకిచ్చిన తక్కిన (ఇతర) వాగ్దానాలు ఈ వాగ్దానపుత్రుడి (ఇస్సాకు) ద్వారా నెరవేరడం మొదలైంది.

**వచనములు 19, 20.** ఆదికాండములో **వంశావళి** תּוֹלְדוֹת (*toledoth*) అనే పదం ఇక్కడ ఎనిమిదవసారి కనబడుతుంది. ఇకనుండి మనకు **ఇస్సాకు** మరియు అతని కుమారుల గురించిన వృత్తాంతాలే కనబడ తాయే తప్ప గతకాలంలోని పూర్వీకుల వంశావళుల వివరాలేవీ కనబడవు. ఈ విభాగంలో ఇస్సాకు జీవితం గురించి వివరాలు క్లుప్తంగా ఉన్నప్పటికీ, ఇది "అబ్రాహాము కుమారుడగు ఇస్సాకు వంశావళి యిదే" అని ప్రారంభమవుతుంది. వాగ్దానపుత్రుని (వాగ్దాన కుమారుడి) ప్రస్తావన అతని తండ్రికి సంబంధించిగానీ, లేక అతని కుమారుడైన యాకోబుకు సంబంధించిగానీ ఉన్న సందర్భాల్లోనే ప్రముఖంగా కనబడుతుంది.

ఈ విభాగం **అబ్రాహాము ఇస్సాకును కనెను** అని గుర్తు చేస్తూ మొదలవు తుంది (21:1–3). అనంతరం, **ఇస్సాకు పద్దనరాములో నివసించు సిరియావాడైన బెతూయేలు కుమార్తె రిబ్కాను** పెళ్లి చేసుకున్నప్పుడు **నలుబది సంవత్సరములవాడు** అని వాక్యభాగం తెలియజేస్తోంది (24:62–67). ఎందుకు ఇస్సాకు నలభై సంవత్సరాల వయసులో పెళ్లిచేసుకున్నాడో అని గానీ, లేక ప్రాచీన పశ్చిమాసియాలో ఇదే పెళ్లి చేసుకొనే వయసు అనిగానీ ఎక్కడా మనకు వాక్యభాగంలో వివరాల్లేవు (26:34 చూడండి). అనంతర కాలంలోని మతబోధకుల రచనల ప్రకారం (రబ్బీలు వ్రాసిన వ్యాఖ్యానగ్రంథాలు) సాధారణంగా పురుషుడి పెళ్లి వయసు పద్దెనిమిది నుండి ఇరవై సంవత్సరాలని తెలుస్తోంది,[12] అయితే పితరుల కాలంలో ఈ ఆచారం భిన్నంగా ఉండేదేమో.

ఇస్సాకు అంతకాలం అవివాహితుడుగా ఉండడానికి కారణం బహుశా అబ్రాహాము తన కుమారునికి కనానీయుల్లో అనుకూలవతియైన వధువును (భార్యను) వెదకడం కావచ్చు. చివరకు, అబ్రాహాము చాలా కాలం ఆలోచించిన తర్వాత (చాలా కాలం సంకోచించిన తర్వాత అని అర్థం), తన కుమారునికి వాగ్దాన దేశంలో సహధర్మచారిణియైన భార్య దొరకదనే నిర్ణయానికొచ్చాడు. కాబట్టి, అతను తనకు అత్యంత నమ్మకస్థుడైన దాసునికి హారానులో ఉన్న పద్దనరాముకు ప్రయాణించే బాధ్యత నప్పగించాడు; ఈ ప్రాంతానికున్న మరో పేరు మెసొపొతమియలోని వాయవ్యభాగం లేదా అరామ్నహరాయిము (24:10 చూడండి). ఈ దాసుడు, అబ్రాహాము సహోదరుడైన నాహోరు కుమారుడైన

బెతూయేలు ఎక్కడున్నాడో వెదికి చూచి, ఆ కుటుంబంనుండి ఇస్సాకుకు తగిన భార్యను తీసుకొని రావాలి.

ఇస్సాకు వివాహం రిబ్కాతో జరిగిన వృత్తాంతంలో రిబ్కా **సిరియావాడైన లాబాను సహోదరి** అని రచయిత విశేషించి సూచనాత్మకంగా ప్రస్తావించాడు (24:29, 50 చూడండి). యాకోబుకు తన మామతో ఎదురు కాబోయే సమస్యలకు ఈ ప్రస్తావన ఒక సంకేతంగా ఉందేమో (29—31 అధ్యాయాలు).

**వచనము 21.** ఇస్సాకు రిబ్కాల వివాహం గురించి రచయిత అప్పటికే ప్రస్తావించడం జరిగిపోయింది కాబట్టి (24:67; 25:20), రచయిత కథా గమనాన్ని ముందుకు నడిపించి, వారికి కుమారులు పుట్టబోయే సందర్భంగురించి తెలిపాడు. శారా తన జీవితకాలంలో చాలా కాలం గొడ్రాలుగా ఉన్నట్టే, రిబ్కా కూడా ఇస్సాకుతో వివాహం జరిగిన తర్వాత దాదాపుగా ఇరవై సంవత్సరాలు **గొడ్రాలు**గానే ఉంది (25:20, 26). అయితే, శారా తన దాసి హాగరుద్వారా కుమారుణ్ణి పొందమని అబ్రాహామును ఒప్పించినట్టుగా, ఉపపత్ని ద్వారా సంతానం పొందాలని రిబ్కా ఇస్సాకును ప్రోత్సహించలేదు. బదులుగా, ఇస్సాకు **ఆమె విషయమై యెహోవాను వేడుకొనెను** అని ఉంది. "వేడుకొనెను" (ప్రార్థించాడు) అనే అర్థాన్నివ్వడానికి ఇక్కడ עָתַר (*'athar*) అనే హెబ్రీ పదాన్నుపయోగించడం జరిగింది; ఈ పదం పాత నిబంధనలో "విజ్ఞాపన లేక మధ్యవర్తిత్వాన్ని సూచించే ముఖ్యమైన నియమిత పదాల్లో లేక నిర్దేశిత పదాల్లో ఒకదానిగా"[13] పాత నిబంధనలో ప్రసిద్ధి చెందింది. ఇది, రిబ్కా గర్భంలో దేవుడే జీవాన్ని నింపగలడని ఇస్సాకు ప్రార్థనలోని చిత్తశుద్ధిని ప్రతిబింబి స్తుంది, అంటే ఇస్సాకు నిండుమనసుతో వేడుకున్నాడని సూచిస్తోంది (నిర్గమ. 8:8, 9, 28—30; 9:28; 10:17, 18; న్యాయాధి. 13:8; 2 సమూ. 24:25 చూడండి). ఫలితంగా, **యెహోవా** అనుగ్రహం (దయ) చూపించాడు. ఆయన ఇస్సాకు **ప్రార్థన వినెను** అనీ, **రిబ్కా గర్భవతి ఆయెను** అనీ ఉంది. ఇస్సాకు ప్రార్థనకు జవాబే రిబ్కా గర్భంలోని కవల పిల్లలు.

**వచనము 22.** రిబ్కా గర్భంలో **శిశువులు** పెరుగుతూనే **ఒకనితో నొకడు పెనుగులాడుకున్నారు. పెనుగులాడిరి** అనే అర్థాన్నిచ్చే רָצַץ (*ratsats*) హెబ్రీ పదం "నలగగొట్టు" అనీ లేదా "శరీరావయవాల్ని చితకకొట్టి బాధించు" అనీ అర్థాన్నిచ్చే తీవ్రమైన (ఘాటైన) పదం.[14] రిబ్కా గర్భంలోని ఘర్షణ ఎంత ప్రచండంగా ఉందంటే, ఆమె తానిక బ్రతకలేనని అనుకుంది. మొదటగా, ఆమె గర్భం ధరించడమే ఒక సమస్య అయ్యిందనుకుంటే, ఇక ఇప్పుడు గర్భంలో జరుగుతున్న పెనుగులాట ఆమెకు తీవ్రమైన మానసిక వ్యథ (క్షోభ) కలిగించింది; ఎంతగానంటే ఆమె ఈ బాధనుబట్టి వ్యథనుబట్టి బ్రతుకే భారమన్నట్టుగా విస్మయపడింది. ఆమె ప్రతిప్రత్యుత్తరము గురించి తెలిపిన పదం హెబ్రీ భాషలో అసమాపక క్రియాపదం కాబట్టి, అనువాదకులు ఈ పదాన్ని స్వప్రయత్నపూర్వకమైన ఊహాధారిత అర్థంగానే తెలియజేయడం జరిగింది. తీవ్రమైన బాధననుభవించే స్త్రీ ఎలా సంపూర్ణమైన

అర్థాన్నిచ్చే పదసముదాయాన్ని (వాక్యాన్ని) పలుకుతుందని మనం అర్థం చేసుకొన గలం; అయితే, NASB అనే ఆంగ్ల బైబిల్ ఆమె లోలోతుల్లోని భావాన్ని వెలికితీసి ఆమె అనుభవించిన వేదన గురించి **ఈలాగైతే నేను ... యెందుకని అనుకొని యీ విషయమై** అని తెలియజేస్తోంది. మరొక విధంగా చెప్పాలంటే, ఆమె ఈ విధంగా ఆలోచించిందని చెప్పవచ్చు: "ఇంత కాలం తర్వాత, నేను గర్భం ధరించేలా దేవుడు దయచూపడం, నాలోనే ఒకరి నొకరు చితకకొట్టుకుంటూ ఇంత బాధ నాకు కలి గిస్తున్న ఈ కవల శిశువుల్ని మోయడంకొరకేనా?" ఆమె ఈ విధంగా కూడా విస్మయం చెంది ఉండవచ్చు: "ఇలా తన్నుకొనే వీళ్లు బ్రతికి బయటపడగలరా?" మరియు "నేను ఈ కఠినపరీక్షను భరించగలనా?"

హతాశురాలైన రిబ్కా **యెహోవాను అడుగ వెళ్లెను** అని ఉంది. ఈ మాటలు కొంతవరకు అర్థంచేసు కోడానికి వీలుపడని చిక్కుముడిగానే కనబడుతున్నాయి. తదుపరి కాలంలోనైతే, ఇటువంటి మాటలు సాధారణంగా ఒక ప్రవక్తను సంప్రదించడంతో ప్రమేయం కలిగి ఉంటాయి (నిర్గమ. 18:15; 1 సమూ. 9:9; 1 రాజులు 22:8). ఏదేమైనా, "మెల్కీసెదెకు వంటి దేవుని మనిషి ఎవరైనా ఆ కాలంలో షాలేములో (యెరూ షలేము) ఉన్నారేమో" అనుకొనే సూచన కూడా ఏమీ కనబడడంలేదు.[15] కొంతమంది వ్యాఖ్యాన రచయితలు ఊహించినట్టుగా, ప్రవక్తవంటి మనిషినెవరినైనా కలుసుకోడానికి ఆమె ఏ పుణ్యస్థలానికైనా వెళ్లి ఉండవచ్చేమో ననైనా వాక్యభాగం సూచించడం లేదు. అటువంటి వ్యక్తిని కలుసుకోవాలని ఆమె కోరుకున్నా గానీ, ఆమె శారీరక పరిస్థితి అటువంటి ప్రయాణానికి సహకరించక పోవచ్చు. అలాగైతే, దరిదాపుల్లో తన భర్త నిర్మించిన బలిపీఠం ఏదైనా ఉంటే ఆమె యెహోవాను ప్రార్థించడం కొరకు అక్కడకు వెళ్లి ఉండవచ్చని ఈ ప్రకటనగురించి అర్థంచేసుకొనడం సమంజసంగా ఉంటుందేమో. పైగా, ఇంతక్రితం వేడుకొన్నట్టు ఇప్పుడు కూడా ఆమె తన పక్షాన దేవుణ్ణి వేడుకొనమని ఇస్సాకును కూడా అర్థించి ఉండవచ్చు (25:21).

**వచనము 23.** రిబ్కా ఏంచేసినా గానీ ఏదేమైనా గానీ ఆమెకు జవాబు లభించింది, యెహోవా వెంటనే ప్రత్యుత్తరమిచ్చాడు. నిరాశ ఆవరించిన సమయంలో ఆమెపట్ల యెహోవా దయచూపించాడు. ఆమె **గర్భములో** పెనుగులాడుకొనేవారు కవల శిశువులనీ, వారినుండి వేర్వేరు **రెండు జనములు** (జాతులు) ఉద్భ విస్తాయనీ దేవుడు ఆమెతో చెప్పాడు. ఇది ఆమెకు నిశ్చయాత్మకమైన అభయాన్ని, అంటే వారిలోనుండి అనేక జనాలు ఉద్భవిస్తారని దేవుడు అబ్రాహాము శారాలకు ఇచ్చిన వాగ్దానం (17:4–6, 16) ఇంకా నిలిచే ఉందనే ధీమానిచ్చింది. ఈ వాగ్దానం కార్యరూపం దాల్చడంలో తన పిల్లలే సాధనాలని ఆమెకు తెలిసింది.

ఏదేమైనా, రిబ్కా గర్భంలో కవలశిశువుల పెనుగులాటకు కారణం గురించి తెలిపిన ఈ పూర్వ సమా చారంలో కొంత గుణాభావంలేని (రుణాత్మకమైన లేదా ప్రతిషేధాత్మకమైన) విషయం కూడా ఉంది. భవిష్యత్తులో ఇది దేనికి దారితీస్తుందో

ఆమె స్పష్టంగా అర్థం చేసుకొనకపోయినప్పటికీ, ఈ పెనుగులాట (ఘర్షణ) నిరంతరం ఉంటుందనే విషయాన్ని ముందుగానే ఈ ప్రవచనాత్మక సందేశం తెలియజేస్తోంది. రాబోయే సంవత్సరాల్లో, ఏశావు ఆకలితో ఉండడం చూచిన ఉపాయశాలియైన యాకోబు, ఏశావు తన జ్యేష్ఠత్వపు హక్కును అమ్ముకొనేలా అతనిని ఒప్పించడం జరుగుతుంది (25:29–34). పైగా, యాకోబు అతని తల్లి ఇద్దరూ కలిసి మరణపడకమీద కళ్లు సరిగ్గా కనబడకుండా ఉన్న ఇస్సాకు ఏశావును ఆశీర్వదిస్తున్నట్టుగా అతనిని భ్రమపర్చి అతను యాకోబును ఆశీర్వదించేలా చేయగలరని ఇది ముందుగానే చూచాయగా తెలియజేస్తోంది (27:18–19).

యాకోబు మరియు ఏశావుల భావి సంతతివారు నిరంతరం ఘర్షణ పడుతూ **రెండు జనపదములు**గా వేరైపోవడం ఈ ప్రవచనంలోని ముఖ్యమైన నెరవేర్పు. **పెద్ద**వాడి వంశస్థులు తుదకు **చిన్న**వాడి వంశస్థులకు **దాసుల**వుతారు, చిన్నవాడు ఇద్దరిలో **బలిష్ఠమైన**వాడవుతాడు. కాబట్టి ఈ ప్రవచనం, ఏశావు యాకోబులు తల్లిగర్భంలో పెనుగులాడుకోడంలోను వారు పెరిగి పెద్దవారై ఆధిపత్యంకొరకు ఘర్షణపడడంలోను ఆ ఇద్దరికి మాత్రమే పరిమితమైనది కాదనీ తెలుస్తోంది. వాస్తవానికి, అన్నయైన ఏశావు తమ్ముడైన యాకోబుకు వ్యక్తిగతస్థాయిలో ఎన్నడూ దాసుడుగా లేడు. భవిష్యత్కాలంలో యాకోబు సంతానమైన ఇశ్రాయేలీయులు ఏశావు సంతానమైన ఎదోమీయుల్ని అణచివేయబోయే భవిష్యదర్శనాన్ని దేవుడు ముందుగానే చూచాడు. ఏమైనా, ఈ రెండు విభిన్న జాతుల మధ్య కొనసాగుతూనే ఉన్న సంఘర్షణలు దావీదు కాలంవరకు పతాక స్థాయిని చేరలేదు; ఆ తర్వాతనే ఇశ్రాయేలీయులు ఎదోమీయుల్ని పూర్తిగా ఓడించి వారిని దాసులుగా చేయడం జరిగింది (2 సమూ. 8:14).

**వచనము 24.** అతికష్టంమీద, నెలలు నిండి ప్రసూతికాలం సమీపించేవరకు **ఆమె** తన **గర్భమందు** ఒకరితో ఒకరు పెనుగులాడుకుంటున్న వంశాల్ని మోసింది. రిబ్కా కవల మగపిల్లలకు జన్మనివ్వడంతో, నిగూఢమైన (జటిలమైన) ఈ ప్రవచనంలోని తొలిభాగం నెరవేరింది.

**వచనము 25.** కవలపిల్లల్లో **మొదటివాడు ఎఱ్ఱనివాడుగా** ఉన్నాడనీ, **అతని ఒళ్లంతయు రోమ వస్త్రమువలె** ఉందనీ తెలుస్తోంది. "ఎఱ్ఱని" (אַדְמוֹנִי, *'admoni*) అనేదాని గురించి సూక్ష్మపరిశీలన కష్టతర మైనదే,[16] అయితే ఈ మాటలు బహుశా అతను కపిల ఛాయలో (ఎరుపు-గోధుమరంగుల మిశ్రమ ఛాయ) ఉన్నాయనే అర్థాన్నివ్వవచ్చు. 1 సమూ. 16:12; 17:42 వచనాల్లో, దావీదు మేనిఛాయను వర్ణించడానికి కూడా ఇదే హెబ్రీ పదాన్నుపయోగించడం జరిగింది. ఈ వర్ణన తొలిపిల్లవాడి తలవెండ్రుకల రంగు వర్ణనా లేక, అతని శరీరఛాయగురించి వర్ణనా అనేది స్పష్టంగా లేదు. ఎలాగైనప్పటికీ, ఏశావుకున్న మరో పేరైన "ఎదోము" (אֱדוֹם, *'Edom,* *ఎదోము*; 25:30) అనే పేరుకు కచ్చితంగా ఇది శబ్దచాతుర్యంలాగా (శబ్దక్రీడ) కనబడుతుంది; ఎదోము అనే పేరు కూడా "ఎఱ్ఱని" అనే అర్థాన్నిచ్చే హెబ్రీ

మూలంనుండే వచ్చింది.[17] “రోమ”మయమైన (שֵׂעָר, *śe‘ar*) అనే మరో పదం కూడా ఇంకా ఎక్కువగా సంకీర్ణమైన అర్థాన్నిచ్చే పదమే (మిశ్రిత పదం); ఇదే అర్థం ఏశావు (עֵשָׂו, *‘Eśaw,* ఏశావు) అనే పేరులో కనబడుతుంది. ఈ రెండు పేర్లూ ఒకే హల్లుతో మొదలైనా అవి విపర్యంగా (అంటే, ఒక పదంలో మొదట ఉన్న హల్లు రెండో పదంలో చివరగా) కనబడుతూ శబ్దచాతుర్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఆ విధంగానే, హెబ్రీలో “శేయీరు” అనే పేరులో కూడా శ్లేషార్థం కనబడుతోంది; ఈ పదం “వెంట్రుకలున్న” (*śe‘ar,* “రోమమయమైన”) అనే అర్థాన్నీ, “శేయీరు మన్నెము” అనే ఒక నామవాచకపదాన్ని (שֵׂעִיר, “*Seir,*” “శేయీరు”) సూచిస్తుంది (ద్వితీయోప. 1:2; 2:1, 5; యెహోషువ. 15:10; 24:4). మృతసముద్రానికి దక్షిణాన మరియు తూర్పున వ్యాపించి ఉన్న శేయీరు మన్నెం ఎదోమీయులకు నివాసప్రాంతమైంది (32:3; 36:8, 9; న్యాయాధి. 5:4).

**వచనము 26.** మొదటగా ఏశావు పుట్టిన తర్వాత, రెండోవాడు బయటికి వచ్చాడు; **అతని** (రెండవవాడి) **చెయ్యి** మొదటగా బయటికి వచ్చిన **ఏశావు మడిమెను పట్టుకొని** ఉంది గనక అతనికి **యాకోబు** అనే పేరు పెట్టారు. “యాకోబు” (יַעֲקֹב, *Ya‘aqob, యాకోబు*) అనే పేరుకు అక్షరాలా “మడిమె పట్టుకొనేవాడు, లేక వంచనతో పదవీభ్రష్టున్ని చేసి లాక్కొనేవాడు” అని అర్థం. ఈ పేరులోని ప్రతీకాత్మక అర్థం (సంకేత భావం) ఇక్కడ చాలా ముఖ్యమైంది, ఎందుకంటే రెండోవాడు మొదటివాడు కాలి మడిమెను పట్టుకొని వెనక్కు లాగడం తల్లి గర్భంలోనే మొదలైన పెనుగులాట అనీ, అది వారి జీవితకాలమంతా కొనసాగనుందనే భావనను చూచాయగా తెలియజేస్తోంది. పైగా నామవాచక పదమైన “మడిమె” (עָקֵב, *‘aqeb*) “వంచించడం” (עָקַב, *‘aqab*) అనే క్రియాపదంతో కూడా సంబంధమున్నదిగా కనబడుతుంది; కాబట్టి, “మడిమె” అనే పదాన్ని, నమ్మిన స్నేహితుని వంచించడమనే అర్థాన్నిచ్చేట్టుగా రూపకాలంకార పదంగా ఉపయోగించినట్టు చూడగలం (“నన్ను తన్నుటకై తన మడిమె నెత్తెను”; కీర్తనలు 41:9).

యాకోబులో ఈ స్వభావలక్షణాలు అతని చిన్నతనం నుండే పెంపొందాయి. ఈ నైజం అతను తన అన్నతోను తన తండ్రితోను తనకు మేలు కలిగేలా తనకనుకూలంగా వారిని వంచించేలా (మోసగించేలా) నడిపించింది (27:18–29). రిబ్కా ఈ కవలపిల్లల్ని **కనినప్పుడు, ఇస్సాకు అరువది యేండ్లవాడు.** అతని భార్య మరియు అతని కుమారుడు ఇస్సాకును మోసగించడానికి ఉపాయం పన్నినప్పుడు అతని (వయసు) ఎంతో వాక్యభాగం తెలియజేయడం లేదు. ఈ సంఘటన జరిగేనాటికి ఏశావు యాకోబులిద్దరూ పెద్దవారై ఉండవచ్చు, మరియు ఇస్సాకు గురించి అతను “వృద్ధుడై” అనే వర్ణన కనబడుతోంది కాబట్టి కళ్లు కనిపించనంత ముసలి వాడై ఉండవచ్చు (27:1, 2). పైగా, ఇస్సాకు తాను చనిపోతాడనుకొని ఏశావును ఆశీర్వదించడానికి బదులు యాకోబును ఆశీర్వదించాడు (27:2, 4). అయితే అతను తాను చనిపోతాననుకోడం పొరబాటే, ఎందుకంటే ఇస్సాకు

మరణసమయానికి అతని వయసు నూట ఎనబై సంవత్సరాలు (35:27, 28).

## యాకోబు ఏశావు యొక్క జ్యేష్ఠత్వాన్ని పొందడం కొరకు అతనితో బేరమాడడం (25:27–34)

**[27]ఆ చిన్నవారు ఎదిగినప్పుడు ఏశావు వేటాడుటయందు నేర్పరియై అరణ్యవాసిగా నుండెను; యాకోబు సాధువై గుడారములలో నివసించుచుండెను. [28]ఇస్సాకు ఏశావు తెచ్చిన వేటమాంసమును తిను చుండెను గనుక అతని ప్రేమించెను; రిబ్కా యాకోబును ప్రేమించెను. [29]ఒకనాడు యాకోబు కలగూర వంటకము వండుకొనుచుండగా ఏశావు అలసినవాడై పొలములోనుండి వచ్చి [30]–నేను అలసియున్నాను, ఆ యెఱ్ఱయెఱ్ఱగా నున్నదానిలో కొంచెము దయచేసి నాకు పెట్టుమని అడిగెను; అందుచేత అతని పేరు ఎదోము అనబడెను. [31]అందుకు యాకోబు–నీ జ్యేష్ఠత్వము నాకిమ్మని అడుగగా [32]ఏశావు–నేను చావబోవు చున్నాను గదా జ్యేష్ఠత్వము నాకెందుకనెను. [33]యాకోబు–నేడు నాతో ప్రమాణము చేయుమనెను. అతడు యాకోబుతో ప్రమాణముచేసి అతనికి జ్యేష్ఠత్వమును అమ్మివేయగా [34]యాకోబు ఆహారమును చిక్కుడు కాయల వంటకమును ఏశావు కిచ్చెను; అతడు తిని త్రాగి లేచిపోయెను. అట్లు ఏశావు తన జ్యేష్ఠత్వమును తృణీకరించెను.**

ఈ క్లుప్త వర్ణన దేవుడెన్నుకున్న ప్రజల్లోని అపరిపూర్ణతను చక్కగా చిత్రీకరించింది. ఉండకూడని ప్రాథమ్యాలు, పక్షపాతం, ఉపాయం, మరియు వంచన మొదలైనవాటిపట్ల మానవనైజం (మనుషుల ధోరణి) ఎలా ఉంటుందో ఇది సవివరంగా తెలియజేస్తోంది.

**వచనము 27.** కవలపిల్లలు **ఎదిగినప్పుడు**, వారి స్వభావాలు అభిరుచులు వేర్వేరుగా అంటే భిన్నంగా ఉన్నట్టు స్పష్టమవుతోంది. **ఏశావు** మోటుగా ఒళ్లంతా వెంట్రుకలతో, **వేటాడుటయందు నేర్పరియై అరణ్యవాసిగా** ఉన్నాడు. అతను ఆరుబయట ప్రదేశాల్లో కార్యకలాపాలపట్ల సంతోషం వెలిబుచ్చేవాడు. ఇందుకు భిన్నంగా, **యాకోబు సాధువై గుడారములలో నివసించుచుండెను** అని తెలుస్తోంది. ఇతను ఎవరితోనూ పరస్పర సంబంధం లేక, చాలా సమయాన్ని **గుడారములలో** గడిపేవాడు. వాక్యభాగంలో కనిపించే "సాధువై" అనే పదానికి హెబ్రీలోని תָּם (*tham*) అనే పదం పలు సందర్భాల్లో "యథార్థవర్తనుడు" అనే అర్థాన్ని కూడా ఇస్తుంది (యోబు 1:1, 8; 8:20; కీర్తనలు 37:37; సామెతలు 29:10). ఏమైనా గానీ, యాకోబు యథార్థ వర్తనుడని ఈ వాక్యభాగంలోని వర్ణన వెల్లడిచేయడం లేదు. పైగా, ఈ నిర్వచనం ఈ సందర్భానికి తగినది లేక అనుచితమైనది కూడా కాదు; ఎందుకంటే రచయిత ఇక్కడ ఆరుబయట మొరటుగా[19] తిరిగే ఏశావుకు, గుడారాల్లో

ఉంటూ ప్రశాంత జీవనం గడిపే[20] యాకోబుకు మధ్య వ్యత్యాసాన్ని ఎత్తి చూపిస్తున్నాడు.

**వచనము 28.** 25:29–34 వచనాల్లోని సంఘటనలకు పూర్వం, యాకోబు ఏశావుల మధ్య తీవ్రమైన గొడవలున్నట్టుగా మనకు ఏ వివరాలు లభ్యం కావు; అయితే వారి మధ్య ఉన్న సమస్యలెటువంటివైనా, తలి దండ్రుల పక్షపాత ధోరణి వీరి మధ్య అగ్ని రాజేసి ఉంటుందని చెప్పవచ్చు. **ఇస్సాకు ఏశావు తెచ్చిన వేట మాంసమును తినుచుండెను గనుక అతని ప్రేమించెను** అని వాక్యబాగం తెలియజేస్తోంది. అయితే, **రిబ్కా యాకోబును ప్రేమించెను** అని ఉన్నదానికి మాత్రం ప్రత్యేకించి ఏ కారణాన్ని పేర్కొనలేదు. బహుశా యాకోబు ప్రవృత్తులు అభిరుచులు అతని తల్లి ప్రవృత్తులు అభిరుచుల్లాంటివే అయ్యుండవచ్చు. ఈ కారణంగానే అతను చాలా మటుకు ఆమెతోబాటు ఇంట్లోనే (గుడారాల్లో) గడపడం, ఏశావు అరణ్యాల్లోకి వేటకు వెళ్లి ఉండడం జరిగి ఉంటుంది. ఇద్దరు కుమారుల్లో తండ్రి ఒకరిని, తల్లి మరొకరిని "ప్రేమించెను" (אָהֵב, *'aheb*) అని కనబడుతోంది; అయితే ఈ హెబ్రీ పదం కుటుంబసభ్యుల మధ్య ఉండే ప్రేమానురాగాల్ని వ్యక్తం చేయడానికి ఉపయోగించే సర్వ సాధారణమైన పదమే. తలిదండ్రులు తాము ఎవరిపట్లనైతే పక్షపాతం చూపడంలేదో వారిని ద్వేషిస్తున్నట్టుగా ఇది సూచించడం లేదు; కాకపోతే ఒకరిమీద కంటె మరొకరిమీద ఎక్కువ మమకారాన్ని పక్షపాతాన్ని చూపించారు (29:30–33 చూడండి).

**వచనములు 29, 30.** అలవాటు ప్రకారంగానే, యాకోబు ఇంట్లోనే (గుడారాల్లో) ఉన్నాడు, ఏశావు అరణ్యంలోకి వేటకు వెళ్లాడు. హాస్యాస్పదంగా, ఏశావు వట్టిచేతులతో ఇంటికి తిరిగి వచ్చాడు. అతను వేటాడడంలో నేర్పరియైనా ఈసారి ఎంత వెదికినా వేటాడడానికి ఏ జంతువూ దొరకలేదు. ఏశావు తన ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి తీవ్రమైన బడలికతోను మరియు ఆకలితోను ఉన్నాడు. వాక్య భాగం అతను **అలసి** (עָיֵף, *'ayep*) ఉన్నాడని చెప్పడంలో, ఈ పదం అతనికి ఆహారం లేకపోయినందువలన అతని శరీరం బలహీనపడిన స్థితిని సూచిస్తుంది. ఏశావు శరీరం దుర్బలంగా (బలహీనస్థితి) ఉండడం చూచి, ఉపాయశాలియైన అతని తమ్ముడైన యాకోబు దీన్ని తనకు అవకాశంగా మలచుకున్నాడు.

తన తమ్ముడు **కలగూరవంటకము** ఏదో **వండుకొనుచుండగా**, అందులో కొంచెం పెట్టమని అతనిని ఏశావు బ్రతిమిలాడాడు. ఏశావు ఆ వంటకాన్ని **యెఱ్ఱయెఱ్ఱగా నున్న**దని సూచించాడు. హెబ్రీలో "యెఱ్ఱని" (אָדֹם, *'adom*) అనే అర్థాన్నిచ్చే పదంనుండి వ్యుత్పన్నమైన (శబ్దసంభవ ప్రకారం ఏర్పడిన) పేరును, అంటే ఏశావుకున్న **ఎదోము** (אֱדוֹם, *'Edom*) అనే మరో పేరును (భాషాపరంగా ఇది ఒక అర్థా లంకారం) మోషే ఇక్కడ వైకల్పికంగా స్పష్టం చేస్తున్నాడు (25:25 వివరణలు చూడండి).

**వచనము 31.** యుక్తిపరుడైన **యాకోబు** ఏశావుయొక్క బలహీనక్షణాన్ని తన

కనుకూలంగా మలచు కున్నాడు. యాకోబు ఏశావుకు వంటకాన్నిచ్చేముందు, అతను తన అన్నను అతని **జ్యేష్ఠత్వము** తనకి**మ్మని** అడిగాడు. "ప్రథమ కుమారుడికి" (בְּכוֹר, *b^ekor*) చెందే హక్కు "జ్యేష్ఠత్వము" (בְּכֹרָה, *b^ekorah*); అయితే ఇది ఏశావుకు కొద్ది సమయం మాత్రమే దక్కింది (25:25, 26). కుటుంబంలోని జ్యేష్ఠకుమారుడికి మిగిలిన పిల్లలకంటె అధికంగా ఎంత స్వాస్థ్యాన్నివ్వాలనే విషయాన్ని నిర్ధారించే చట్టాలు గానీ సంప్రదాయాలు గానీ ప్రాచీన పశ్చిమాసియాలో అంతటా ఏకరీతిగా లేవు. అనంతర కాలంలో, మోషే ధర్మశాస్త్రం ప్రకారం జ్యేష్ఠ కుమారుడు కుటుంబంలో మిగిలినవారికంటె రెండింతల భాగాన్ని స్వాస్థ్యంగా పొందడం జరిగింది (ద్వితీయోప. 21:15–17). మెసొపొతమియలోని నూజి శిలాఫలకాలు కూడా (క్రీస్తు పూర్వం పదిహేనవ శతాబ్దం నాటివి) కుటుంబంలోని తొలి కుమారుడు రెండంత స్వాస్థ్యాన్నందుకున్నట్టుగా ప్రస్తావిస్తున్నాయి; అయితే ఇది దత్తుడైన కుమారునికి (కుమారునిగా దత్తతకు వచ్చిన, లేదా పెంపకానికి వచ్చిన వ్యక్తి) వర్తించదు.[21] యాకోబు కాలంలో స్వాస్థ్యంలోని ఎంత భాగాన్ని జ్యేష్ఠత్వపు హక్కు క్రింద నిర్ణయించారో స్పష్టంగా తెలియడంలేదు. నూజి శిలాఫలకాలు యాకోబు కాలానికి అనంతర కాలంనాటివైనప్పటికీ, జ్యేష్ఠుడు తన జ్యేష్ఠత్వపు హక్కును కుటుంబంలోని ఇతర సోదరుల్లో ఎవరికైనా, అంటే ఏశావు తన జ్యేష్ఠత్వపు హక్కును తమ్ముడైన యాకోబుకు అమ్మినట్టుగా, అమ్మివేసే ఏర్పాటుందని తెలియజేస్తున్నాయి. కొంత మేరకు ఈ వివరాలు ఆదికాండము 25:27–34 వచనాల్లోని విషయాలకు సమానాంతరంగానే ఉన్నాయి.[22]

**వచనము 32.** ఏశావు బడలికచేత ఎంతగా విసుగు చెంది ఉన్నాడంటే, యాకోబు వండుతున్న వంటకపు కమ్మని వాసనలు అతని వివేచనాశక్తిని (యుక్తాయుక్తపరిజ్ఞానాన్ని) మసకపర్చాయి. ఏశావు తనకెదురైన సంకటస్థితిని (క్లిష్టపరిస్థితి), **నేను చావబోవుచున్నాను గదా** అని వాస్తవానికి మించి అంచనా వేసుకొని (లేదా, ఊహించుకొని) తనకు తానుగా తన తమ్ముడి పథకానికి అవకాశమిస్తున్నాడు (లేదా తన తమ్ముడి పథకానికి వశమైపోతున్నాడు). ఏశావుకెదురైన సంకటస్థితి వాస్తవికమైనదైతే, ఆ సమయంలో తనకు **జ్యేష్ఠత్వము** అక్కర్లేదనుకున్నా సరే, యాకోబు అవకాశవాదం నిర్దయాపూర్వకంగా ఉందని చెప్పవచ్చు. ఏమైనప్పటికీ, ఏశావు తన స్థితిని వాస్తవానికి మించి పెద్దదిగా చెప్పుకున్నాడు. ఈ సంఘటన ద్వారా, జీవితంలో మౌలికమైన ప్రాథమ్యాల విషయంలో ఏశావు స్వభావంలోని బలహీనత బయటపడింది. ఏశావు తన నిర్ణయాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలుండాలని కోరుకొనడంకంటె, అప్పటికప్పుడు తనకేం కావాలో ఆలోచిస్తూ నమ్మకాన్ని లేదా స్థిరత్వాన్ని కోల్పోవడం గమనార్హం.

**వచనము 33.** తన భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బేరమాడిన మోసగాడిగా **యాకోబు** కన్పిస్తున్నాడు. అవివేకం మరియు నిర్లక్ష్యం ప్రదర్శించే ఏశావు ప్రవృత్తిని

(నైజం, స్వభావం) తన కను కూలంగా మలచుకున్న యాకోబు, తన అన్న ఒక గిన్నెడు వంటకం కొరకు తన జ్యేష్ఠత్వాన్ని అమ్మివేసేలా ఎత్తుగడ వేశాడు. ఏశావు ఆ వంటకాన్ని తినడానికి ముందే, యాకోబు తన అన్నను **ప్రమాణము** చేయమని అడిగాడు; ప్రమాణానికి నిబద్ధత ఉందని, ఒక సారి ప్రమాణం చేసిన తర్వాత దాన్ని వెనక్కు తీసుకోవడం జరగదని అతనికి తెలుసు. యాకోబు దబాయింపు ఏశావును అడ్డగించలేకపోయింది; ఏశావు **ప్రమాణముచేసి అతనికి జ్యేష్ఠత్వమును అమ్మి**వేశాడు.

**వచనము 34.** ఈ బేరం ముగిసిన తర్వాత మోసగాడైన **యాకోబు**, తినడానికి **ఆహారమును చిక్కుడు కాయల వంటకమును** మరియు త్రాగడానికి పానీయాన్నికూడా **ఏశావు** కిచ్చాడు. అన్న **తిని త్రాగి** తన ఆకలి తీర్చుకొని అక్కడనుండి **లేచిపోయెను** అని ఉంది. ఈ క్లుప్త సారాంశంలో, **ఏశావు తన జ్యేష్ఠత్వమును తృణీకరించెను** అని చెప్పి ముగిస్తూ రచయిత ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఏం జరిగిందో నిర్ధారణపూర్వకంగా తెలియజేశాడు. "తృణీకరించెను" בָּזָה (*bazah*) అనే పదానికి "ఏవగించుకొను" అనీ, లేక "నిర్లక్ష్యంతో ధిక్కరించు" అనే అర్థాలున్నాయి.[23] ఇది, ఏదైనా ఒక దాని విలువను అనాలోచితంగా నిర్లక్ష్యంతో హీనంగా చూడడాన్ని సూచించే ఘాటైన పదం ఇది. మనిషిని, దేవుణ్ణి, లేక దైవాశీస్సుల్ని నిర్లక్ష్యంతో ధిక్కరించడాన్ని కూడా ఈ పదం సూచిస్తుంది (సంఖ్యా. 15:30, 31; 2 సమూ. 12:10; యెహెజ్కేలు 16:59; 17:16, 18; మలాకీ 1:6, 7).

క్రైస్తవులు తమ విశ్వాసం విషయంలో అశక్తులు (బలహీన మనస్కులు) కావడాన్నిబట్టి, ప్రతికూల పరిస్థితులు మరియు హింసల వలన తమ విశ్వాసాన్ని విడిచిపెట్టే లేదా తృణీకరించే అపాయం ఉండడాన్ని బట్టి, హెబ్రీ పత్రిక రచయిత క్రైస్తవుల్ని హెచ్చరించిన సందర్భంలో ఈ సంఘటనగురించి ప్రస్తావించాడు. అతను వారిని హెచ్చరిస్తూ,

> మీలో ఎవడైనను దేవుని కృపను పొందకుండ తప్పిపోవునేమో అనియు, చేదైన వేరు ఏదైనను మొలిచి కలవరపరచుటవలన అనేకులు అపవిత్రులై పోవుదురేమో అనియు, ఒక పూట కూటికొరకు తన జ్యేష్ఠత్వపు హక్కును అమ్మివేసిన ఏశావు వంటి భ్రష్టుడైనను వ్యభిచారియైనను ఉండునేమో అనియు, జాగ్రత్తగా చూచుకొనుడి. ఏశావు ఆ తరువాత ఆశీర్వాదము పొంద గోరి కన్నీళ్లు విడుచుచు దాని కోసరము శ్రద్ధతో వెదకినను, మారుమనస్సు పొంద నవకాశము దొరకక విసర్జింపబడెనని మీరెరుగుదురు (హెబ్రీ. 12:15–17).

# అన్వయము

## దేవుని చేత ఇస్సాకు మరియు యాకోబు భౌతిక ఎంపిక (25:1–28)

దేవుడు మొదట అబ్రాహామును పిలిచినప్పుడు, అతనిని "గొప్ప జనముగా" చేస్తానని ఆయన వాగ్దానం చేశాడు (12:2). దేవునిచేత "ఎన్నికైన" (בָּחִיר, *bachir*) వ్యక్తిగా[24] (నెహెమ్యా. 9:7 చూడండి), అతను తన భావితరాల వారికి మరియు భూమ్మీద ఉన్న సమస్త వంశాలవారికి ఆశీర్వాదాల్ని ప్రవహింపజేసే వాహకుడుగా లేక మార్గదర్శిగా ఉండాలి (12:2, 3). కొన్ని సంవత్సరాలు గడిచిన తర్వాత యెహోవా అబ్రాహాముతో, "భూమిమీదనుండు రేణువుల" వలె మరియు "నక్షత్రముల" వలె అతని సంతానం విస్తారంగా ఉండబోతుందని చెప్పాడు (13:16; 15:5). చాలా సంవత్సరాల తర్వాత, పితరుడు తొంబై తొమ్మిది సంవత్సరాల వయసుగలవాడైనప్పుడు, పితరుడిలో నుండి "జనములు" మరియు "రాజులు" వస్తారని దేవుడతనితో చెప్పాడు (17:1, 6). చివరగా, శారా "జనములకు తల్లి" కానుందని మరియు ఆమెనుండి అనేక మంది రాజులు వస్తారని దేవుడు ముందుగానే చెప్పాడు (17:15, 16). ఇదంతా అబ్రాహాము శారాలకు అసాధ్యమైందిగా కనబడింది గనక, వారు అపనమ్మికతో నవ్వడం జరిగింది (17:17; 18:10–13); అయితే దేవుడికి అసాధ్యమైంది ఏదీ లేదని చివరకు వారు తెలుసుకున్నారు (18:14).

సుదూరంలో జరగనున్నదేయైనా ఇది నిజమే గదా—ఎదోము మరియు ఇశ్రాయేలు (అనంతర కాలంలో ఉత్తర రాజ్యమైన ఇశ్రాయేలుగా, దక్షిణ రాజ్యమైన యూదాగా పేరు కావడం జరిగింది) అనే జాతులు (జనములు) ఏర్పడ్డాయి, రాజులు వచ్చారు. ఏదేమైనప్పటికీ, దేవుడు సెలవిచ్చిన ఈ వాగ్దానాల నెరవేర్పు లోని తొలి దశల్ని ఈ అధ్యాయం వెల్లడిచేస్తోంది. "అబ్రాహాము మరల ఒక స్త్రీని వివాహము చేసికొనెను, ఆమె పేరు కెతూరా" అనీ, ఆమె ద్వారా అతనికి ఆరుగురు కుమారులు కలిగారనీ ఆదికాండము 25:1–4 వచనాలు తెలియజేస్తున్నాయి. వాక్యభాగంలో వీరి పేర్లు మరి కొంతమంది పిల్లల పేర్లతో బాటుగా కనిపిస్తాయి. అబ్రాహాముకు పుట్టిన ఈ కుమారులు మరో పన్నెండు అరేబియన్ తెగలకు నాయకులయ్యారు. వీరి గురించి మనకు ఎక్కువగా తెలియకపోయినప్పటికీ, పితరుడికి విస్తృతసంఖ్యలో భవిష్యతరాల సంతతినిచ్చి దేవుడు తన వాగ్దానంపట్ల విశ్వాస్యత (విశ్వసనీయత) చూపించాడని మనకు తెలుస్తోంది.

హాగరు ద్వారా ఇష్మాయేలును, మరియు అతనిలో నుండి విస్తృత సంఖ్యలో భవిష్యతరాల్ని వృద్ధి చేయడం ఈ విషయంలో దేవుని విశ్వాస్యతకు మరో ఉదాహరణగా నిలుస్తోంది (25:12–16). ఇష్మాయేలుకు "పండ్రెండుగురు రాజులు" జన్మించారు; వీరు మరో పన్నెండు అరేబియన్ తెగలకు నాయకులు కావడం,

యాకోబు నుండి ఉద్భవించే ఇశ్రాయేలీయుల పండ్రెండు గోత్రాలకు సరిసమానంగా కనబడుతోంది. అబ్రాహాము తన పూర్తి స్వాస్థ్యాన్ని ఇస్సాకుకిచ్చినా, ఉపపత్నుల ద్వారా కలిగిన సంతానాన్ని కూడా అబ్రాహాము ప్రేమించి వారికి బహుమానాలిచ్చి, కనాను దేశంలో వారు ఇస్సాకు పట్ల శత్రుత్వం చూపకుండా తాను బ్రతికి ఉండగానే వారిని తూర్పువైపు పంపించివేశాడు (25:5, 6).

హాగరు, కెతూరా అనేవారి ద్వారా అబ్రాహాముకు కలిగిన సంతతివారికి, దేవుడెన్నుకున్న సంతానమైన ఇస్సాకు మరియు ఇస్సాకు కుమారుడైన యాకోబు సంతానం పొందబోయే వాగ్దానదేశంలో ఎటువంటి భాగం లేకపోయినప్పటికీ,[25] అబ్రాహాము వారిని ప్రేమించి వారికి బహుమానాలివ్వడం ద్వారా వారికి ఆశీర్వాదంగా ఉన్నాడు.

అబ్రాహాము తన విశ్వాసాన్ని తన కుమారులతో పంచుకొని వారి జీవితాలపట్ల దేవునికున్న చిత్తం గురించి (ప్రణాళిక) వారికి బోధించాడు. పితరుడిపట్ల యెహోవాకున్న నిశ్చయతగురించి ఒక వాక్యభాగం ఈ విధంగా తెలియజేస్తోంది: "ఎట్లనగా యెహోవా అబ్రాహామును గూర్చి చెప్పినది అతనికి కలుగజేయునట్లు తన తరువాత తన పిల్లలును తన యింటివారును నీతిన్యాయములు జరిగించుచు, యెహోవా మార్గమును గైకొనుటకు అతడు వారి కాజ్ఞాపించునట్లు నేనతని నెరిగియున్నాననెను" (18:19). అబ్రాహాము తన పిల్లలకు బోధించడం గురించిన వివరాలు మనకు లభ్యం కానప్పటికీ, ఇస్సాకు పరిత్యాగం పితరుడు అతనికి దేవుని గురించి బోధించాడని సూచ్యార్థంగా తెలుస్తోంది. పైగా, ఇస్సాకు యుక్తవయసునుండే దేవునిలో దృఢమైన విశ్వాసాన్ని పెంపొందించుకున్నాడు; ఈ విశ్వాసమే అతనిని తన తండ్రికి విధేయత చూపేలా, అంటే అబ్రాహాము అతనిని బంధించి బలిపీఠం మీద ఉంచినప్పుడు అతను తన తండ్రికి లోబడేలా చేసింది (22:1–19). అబ్రాహాము తన కుమారులందరినీ ప్రేమించి వారికి బహుమానాలిచ్చాడు గనక, దేవుడతని గురించి 18:19 వచనంలో సెల విచ్చినట్టుగా అతను వారికి అత్యంత గొప్ప బహుమానమైన "యెహోవా మార్గము"లో శిక్షణను (ఉపదేశం) ఇచ్చి ఉండవచ్చుననేది రూఢిగానే (నమ్మదగినదిగానే) కనబడుతుంది.

భౌతికపరమైన ఎన్నికలో భాగమా లేక భాగం కాదా అనే విషయం ఒకరి అధ్యాత్మిక గమ్యాన్ని నిర్ణయించదు. అబ్రాహాము కుటుంబంలోని ప్రతి వ్యక్తికీ, ఏకైక నిజదేవుడిపట్ల పితరుడికున్న విశ్వాసాన్ని నిలిపి ఉంచుకోడానికి లేక తృణీకరించడానికి ఐచ్ఛికమైన ఎంపిక ఉంది; అతను గానీ ఆమె గానీ ప్రతి వ్యక్తీ "నీతి న్యాయములు జరిగించుచు, యెహోవా మార్గమును గైకొనుట" గురించి అవునా కాదా అని స్వంతంగా నిర్ణయించుకోవాలి. తేలిగ్గా అర్థమయ్యే మాటల్లో ఇది, దేవుని భౌతికమైన ఎన్నికలో ఉన్నా గానీ లేకపోయినాగానీ ఎవరైనా సరే దేవుని ఆధ్యాత్మిక ఎన్నికలో భాగం ("రక్షణ పొందినవారు") కావచ్చు. "ఇశ్రాయేలు సంబంధులందరును (భౌతికమైన) ఇశ్రాయేలీయులు (ఆత్మసంబంధమైన,

ఆధ్యాత్మికమైన) కారు" (రోమా. 9:6) అని పౌలు చెప్పడంలో సంక్షిప్తమైన అర్థమిదే. అపొస్తలుడైన పౌలు ఒలీవ వృక్షాన్ని సాదృశ్యంగా (సామ్యం, పోలిక) తీసికొని, ఒలీవచెట్టు "కొమ్మలలో" (భౌతికంగా ఎన్నికైన ఇశ్రాయేలీయులు) కొన్నిటిని దేవుడు వారి "అవిశ్వాసమునుబట్టి విరిచి" వేసి అన్యప్రజలైన కొందరిని (భౌతికంగా ఎన్నిక కానివారు, అడవి ఒలీవ చెట్టువంటివారు) వారి "విశ్వాసమునుబట్టి" ఒలీవ చెట్టుకు "అంటు" కట్టి వారిని తానెన్నుకున్న ప్రజల్లో భాగం చేయడం గురించి వర్ణించాడు (రోమా. 11:17–20). అన్యప్రజల్ని అతిశయపడవద్దని పౌలు హెచ్చ రిస్తూ, వారు విశ్వాసంలో నిలిచి ఉండకపోయినట్లయితే, అవిశ్వాసులైన యూదులు విరిచిపేయబడినట్టే వీరూ "విరిచి" వేయబడతారని చెప్పాడు. పైపెచ్చు, అవిశ్వాసులైన యూదులు (విరిచి వేయబడిన ఒలీవ కొమ్మలు) గనక విశ్వసించినట్లయితే, వారూ అన్యప్రజల్లాగానే (అడవి ఒలీవ కొమ్మలు) అంటుకట్టబడతారనీ చెప్పాడు (రోమా. 11:20–24).

దేవుడు అబ్రాహాము యొక్క భౌతిక సంతానాన్ని, అంటే అతని కుమారుడైన ఇస్సాకు మరియు ఇస్సాకు కుమారుడైన యాకోబు నుండి వచ్చినవారిని, నిర్హేతుకంగాను మరియు నిర్నిబంధంగాను (బేషరతుగా) ఎన్నుకొనడం అంతిమంగా వాగ్దాన దేశంలో క్రీస్తు జననానికి గమననిర్దేశమైంది (దారితీసింది). ఇందుకు భిన్నంగా, అబ్రాహాముకు ఆధ్యాత్మిక సంతానంయొక్క ఎన్నిక ఎప్పటికీ నియయబద్ధమైనదే, అంటే షరతు లతో కూడినదే; ఇది దేవుని చిత్తంపట్ల విశ్వాసం మరియు విధేయత మీద ఆధారపడినదే (మత్తయి 3:1–12; లూకా 7:30; గలతీ. 3:26–29). భౌతికమైన ఎన్నికలేని రాహాబు వంటివారు కూడా యెహోవాలో నిజమైన విశ్వాసంగలవారైనందువలన (యెహోషువ 2:8–14; హెబ్రీ. 11:31) ఆధ్యాత్మిక సంతానంగా దేవునిచేత ఎన్నికైనవారయ్యారు.

మోయాబీయురాలైన రూతు మరో ఉదాహరణ. ఆమె భౌతికంగా ఎన్నికచేయబడని ప్రజల్లోని వ్యక్తి; అయినా ఆమె తన అత్త నయోమియొక్క దేవుడైన యెహోవాలో నిజవిశ్వాసురాలైంది. ఆమె తన మోయాబు దైవాల్ని విడిచిపెట్టి, దేవునియొక్క ఆత్మసంబంధమైన ఎన్నికయైన ఇశ్రాయేలు జాతిలో ఒక భాగమైంది (రూతు. 1:16, 17; 4:11–17). పైపెచ్చు, ఆమె యేసు క్రీస్తుకు పూర్వీకురాలైంది (మత్తయి 1:5). ఈ వ్యక్తులు దేవునిచేత ఆత్మసంబంధమైన ఎన్నిక అయినట్టుగానే, ఇష్మాయేలు సంతతివారు మరియు కెతూరాకు పుట్టిన కుమారులు విశ్వాసంతో యెహోవాను ఘనపర్చి ఆయనను సేవించి ఉండినట్లయితే, వారు కూడా దేవునిచేత ఆత్మసంబంధమైన ఎన్నిక అయ్యేవారే.

*ఇస్సాకు ద్వారా ఎన్నికైన వంశం.* శారా వంధ్యురాలిగా బాధపడినట్టే, వివాహం జరిగిన తర్వాత దాదాపు ఇరవై సంవత్సరాలు రిబ్కాకు పిల్లలు పుట్టలేదు (25:20, 26). అబ్రాహాము దాసుడు ఆమెను తీసుకొని వచ్చి ఇస్సాకుకు భార్యగా చేయడాన్ని దేవుని ఏర్పాటు అన్నప్పుడు రెండు కుటుంబాలు ఇది దేవుని

చిత్తప్రకారమైన వివాహమని నమ్మడం జరిగింది. అలాగైతే, రిబ్కా కెందుకు వెంటనే పిల్లలు పుట్టలేదు? సూచితమైన ఈ ప్రశ్నకు వాక్యభాగంలో జవాబు లేదు; అయితే అబ్రాహాము శారా కొరకు వేడుకొన్నట్టుగా (15:1–5), ఇస్సాకు కూడా రిబ్కా పక్షాన యెహోవాను వేడుకొన్నట్టు వాక్యభాగం తెలియజేస్తోంది. చివరకు, రిబ్కా గర్భవతి అయ్యింది (25:21).

రిబ్కా తాను అడిగినదానికంటె ఎక్కువగానే పొందింది, ఆమె గర్భంలో చురుకైన కవల శిశువులున్నారు. కవల శిశువులు ఆమె గర్భంలో పెనుగులాడుకుంటున్న కారణంచేత ఆమె గర్భవతిగా ఉన్న కాలమంతా తీవ్రంగా బాధననుభవించింది. ఇది ఆమె శరీరంలోపల ఒక గొప్పయుద్ధం జరుగుతున్నట్టే ఉంది (25:22). ఆమె తన గర్భంలో జరుగుతున్న పెనుగులాటకు అర్థమేమిటో (కారణమేమిటో) యెహోవాను అడిగింది, అందుకాయన ఆమె గర్భంలోని కవలలు రెండు వేర్వేరు జాతులని జవాబిచ్చాడు. పెద్దవాడైన ఏశావు వంశస్థులు (ఎదోమీయులు) చిన్నవాడైన యాకోబు వంశస్థులకు (ఇశ్రాయేలీయులు) దాసులవుతారు (25:23). ఇస్సాకు మరియు రిబ్కా ఈ ప్రవచనం నెరవేరడాన్ని చూడకుండానే మృతిచెందారు; శతాబ్దాల అనంతరం, దావీదు రాజు ఎదోమీయుల్ని అణచివేచినప్పుడు ఈ ప్రవచనం నెరవేరింది (2 సమూ. 8:14).

అనేకుల అభిప్రాయాలకు విరుద్ధమైనది ఏమిటంటే జన్యువులు (జీవాణువులు) గానీ, పర్యావరణం లేక పరిసరాల ప్రేరణగానీ వ్యక్తియొక్క మనోవైఖరుల్ని పూర్తిగా నిర్ణయించలేవు. మనం చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు మన తల్లిదండ్రులు మన నడవడిని (ప్రవర్తన) రూపుదిద్దడానికి తోడ్పడినప్పటికీ, మన నిర్ణయాల్ని మన అంతిమ లక్ష్యాన్ని మనమే నిర్ధారించుకోవాలి. మనమెటువంటి మనుషులమవుతామోననే విషయంలో పలు అంశాలకు ప్రమేయం ఉన్నా గానీ, మనం ఏ మనుషులం కావాలనుకుంటున్నామో ఎవరి మనుషులం కావాలనుకుంటున్నామో మన జీవితంలో ఏ మార్గాల్లో నడవాలనుకుంటున్నామో ఎన్నుకొనే దక్షత (చర్య తీసుకొనే హక్కు) మనకే ఉంటుంది. నైతికపరంగా స్వేచ్ఛాయుత కర్తగా (స్వతంత్ర కర్తగా) మన తల్లిదండ్రుల ఆకాంక్షలకు, జన్యుపరమైన పరిమితులకు (ప్రతిబంధకాలకు) మరియు పరిసరాల ప్రభావాలకు హెచ్చుగానైనా ఉండడం లేదా తగ్గుగా నైనా ఉండడం జరుగుతుంది. మనం శారీరంగా మానసికంగా ఆత్మసంబంధంగా ఎదుగుతున్నకొద్దీ, దేవునిచేత ఎన్నికైనవారిగా మనం జీవించాలనుకుంటున్నామా లేదా అనేది మనకు మనమే నిర్ణయించుకోవాలి.

ఈ విషయంలో సముచితమైన దృష్టాంతం సౌలు రాజు. అతని జీవితంలో ప్రారంభం బాగానే ఉంది. అతను మంచి ఎత్తు అందమైన రూపం శరీరదార్ఢ్యత గలవాడు. అతను యెహోవాయొక్క అభిషిక్తుడైన రాజు అయినప్పుడు దేవుని ఆత్మ అతని మీదికి రాగా, అతని హృదయం మారిపోయింది (1 సమూ. 9:1, 2; 10:1, 9, 10). అయితే, అతను మొండిపట్టుదలతో (తలబిరుసు) గర్వంతో యెహోవా చిత్తాన్ని

వ్యతిరేకించాడు (1 సమూ. 13:8–14; 15:1–23); ఇంకా అతను దావీదుకు లభించిన ప్రజాదరణ చూచి ఈర్ష్యతో రగిలిపోయాడు (1 సమూ. 18:5–12; 19:8–10). సౌలు అంతరంగంలోని కల్లోలస్థితి అతను దేవునికి విధేయత చూపకుండా అతనిని అధోగతికి దిగజార్చి, చివరకు గిల్బోవ పర్వతం దగ్గర ఫిలిష్తీయుల చేతుల్లో ఇశ్రాయేలు పరాజయానికి మరియు తనను తాను చంపుకొనే విషాదస్థితికి దారితీసింది (1 సమూ. 31:1–6).

తార్సు పట్టణస్థుడైన సౌలు జీవితగాథ ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. పారంపర్య వర్ణనల ప్రకారం, అతను శరీరదార్ఢ్యత గలవాడు గానీ అందమైన రూపం గలవాడు గానీ కాడు. తదుపరి కాలంలో కూడా, అతను చాలా మటుకు "బలహీనుడు" గాను (2 కొరింథీ. 10:10; KJV), తరచూ అనారోగ్యంతో బాధపడే నట్టుగానూ తెలుస్తోంది (2 కొరింథీ. 12:7–9; గలతీ. 4:13–15). అయినా గానీ, అతను యెరూషలేములో మతబోధకులు (రబ్బీలు) నడిపించే పాఠశాలలో అత్యుత్సాహం కలిగిన విద్యార్థిగా ఉండడమేగాక, యేసు నామంపట్ల తీవ్రమైన ద్వేషాన్ని పెంచుకొని క్రైస్తవుల్ని హింసించడమేగాక చివరికి వారిని చంపివేయడానికి కూడా సమ్మతించాడు (అపొ. 26:9–11; 1 తిమోతి. 1:13). ఆదిసంఘాన్ని హింసించడంలో పౌలు (సౌలు) ప్రదర్శించిన తీవ్రేచ్ఛ యూదు మతంలో అతనిని గొప్ప స్థాయికి చేర్చింది; అతను సన్‌హెద్రిన్ సభకు ఉపాధ్యక్షు డయ్యాడు. నజరేయుడైన యేసు అనుచరుల్ని (అనుయాయుల్ని) పౌలు (సౌలు) బంధించి వారిని చెర సాలలో పెట్టడానికి ప్రధాన యాజకులు అతనికి సిఫారసు పత్రాల్నివ్వడం జరిగింది (అపొ. 9:1, 2, 14; గలతీ. 1:13, 14). దమస్కు వెళ్లే రహదారిమీద అతను పునరుత్థానుడైన యేసును ముఖాముఖిగా కలుసుకున్నప్పుడు అతని సర్వస్వం మారిపోయింది. సౌలుకిప్పుడు ఎదురైన ద్వైదీభావం: అతను తాను క్రొత్తగా తెలుసుకున్న సత్యాన్ని ధిక్కరించి, క్రైస్తవుల్ని హింసించడానికి పాత మార్గంలోనే హింసకుడిగా నడవాలా? లేక, పునరుత్థానుడైన యేసును విశ్వసించి ఆయన తన జీవితాన్ని సమూలంగా మార్చివేసేలా అతనిని అనుమతించాలా? యేసును అంగీకరించి ఆయనను రక్షకుడిగా ప్రతిపాదించిన మరుక్షణం యూదియ ప్రజలతణ్ణి శత్రువుగా పరిగణిస్తారని అతనికి తెలుసు (అపొ. 26:12–19; రోమా. 1:15, 16; 10:9–13); అయితే అతను సరైన నిర్ణయం తీసుకొని దేవునిపట్ల మరియు ఆది సంఘంలోను గురుతరబాధ్యతలు స్వీకరించిన దాసుడై యూదులకెలాగో అన్యజనులకూ అలాగే సువార్త ప్రకటించాడని మనకు తెలుసు.

వ్యంగ్యంగా, ఈ ఇద్దరిదీ సౌలు అనే పేరే; ఇద్దరిదీ ఒకే గోత్రం; ఇద్దరిదీ ఒకే మతవిశ్వాసం. ఇశ్రాయేలు ప్రజల్లో ఇద్దరూ గొప్ప స్థాయికి చేరుకున్నారు; దేవుని ఎన్నిక అయిన ఇశ్రాయేలులో భాగమైన వీరిద్దరూ గొప్ప దైవాశీర్వాదాల్ని అనుభవించారు. అయితే, వారి జీవితపర్యవసానం వేర్వేరుగా (భిన్నంగా) ఉంది. ఒకరు దేవునికి వ్యతిరేకంగా విషాదాంతమైన తిరుగుబాటు ప్రదర్శించగా, మరొకరు

సజీవమైన విశ్వాసంతో విజయమరణం పొందారు. నిర్హేతుకమైన దేవుని ఎన్నికకు ఇందులో ప్రమేయం లేదు. ఈ ఇద్దరికీ తమ జీవితాల్లో దేవుని సంకల్పం (చిత్తం, ఉద్దేశం) ఏదో తెలుసు, తమ ఆధ్మాత్మిక జీవితం ఉండబోయే గమనాన్నెన్నుకొనడానికి ఇద్దరికీ స్వేచ్ఛ (స్వతంత్రమైన మనసు) ఉంది. సౌలు రాజు తన స్వంత ప్రణాళిక ప్రకారం నడిచి, తన వినాశనానికి తానే కారకుడయ్యాడు. తార్సు పట్టణస్థుడైన సౌలు, తాను క్రైస్తవుల్ని హింసించడం దేవుని చిత్తానికి వ్యతిరేకమని తెలుసుకున్నప్పుడు వెనువెంటనే తన మనసు మార్చుకొని, క్రైస్తవ విశ్వాసాన్ని ప్రచారం చేయడంలో ప్రపంచంలోనే మరెన్నటికీ సాటిలేనివాడయ్యాడు.

*యాకోబు ద్వారా ఎన్నికైన వంశం.* ఏశావు యాకోబులిద్దరికీ తాత నానమ్మలు ఒకరే: విశ్వాసులకు తండ్రియైన అబ్రాహాము మరియు శారా విశ్వాసాన్నిబట్టి వృద్ధ్యాప్యంలో కుమారుణ్ణి కనడం జరిగింది (హెబ్రీ. 11:11). ఏశావు యాకోబులిద్దరికీ తల్లిదండ్రులు ఒకరే: వాగ్దానపుత్రుడైన ఇస్సాకు మరియు దేవునిచేత వారి తల్లిగా ఎన్నికచేయబడిన రిబ్కా (24:1–67). ఈ అన్నదమ్ములిద్దరి స్వభావాలు దేహపరంగాను మానసికంగాను ఆత్మసంబంధంగాను వేర్వేరుగా ఉన్నాయి. యాకోబు అపాయాల ద్వారా పోరాటాల ద్వారా తుదకు దేవునికి చెందినవాడయ్యాడు; ఏశావు మిక్కిలి ధనవంతుడయ్యాడు గానీ (33:1–11) హిత్తీయుల్లోని స్త్రీలను వివాహం చేసుకొని తన తల్లిదండ్రులకు వేదన కలిగించాడు (26:34; 27:46; 28:8, 9). పెద్దవాడైన ఏశావు తనకు జన్మతః వచ్చిన వారసత్వపు హక్కును నిర్లక్ష్యంగా నిరాకరించి, తన జీవితంలో దేవునికి స్థానం లేకుండా చేసుకున్న విషాదపరిస్థితిని తెచ్చుకున్నాడు. హెబ్రీ పత్రిక రచయిత ఇతనిగురించి “ఏశావు వంటి భ్రష్ఠుడైనను” అని పేర్కొన్నాడు (హెబ్రీ 12:16). చిన్నవాడైన యాకోబు ఇశ్రాయేలు పండ్రెండు గోత్రాలకు మూలపురుషుడయ్యాడు.

ఏశావులో ఉన్న క్రమశిక్షణారాహిత్యం మరియు ఆధ్మాత్మిక అశ్రద్ధ మొదలైన వైఖరులు దేవుడు ముందుగా నిర్ణయించినవేనని కొందరు అభిప్రాయం. వీరు, ఆదికాండము 25:23లో ఉన్న “పెద్దవాడు చిన్నవానికి దాసుడగును” అనేదాన్ని, యాకోబు “ఏర్పాటు” (ఎన్నిక) కావడం మరియు ఏశావు తృణీకారానికి గురికావడం అనేవి వారు పుట్టి “మేలైనను కీడైనను చేయక ముందే” (రోమా 9:11, 12) నిర్ణయమయ్యాయని పౌలు వ్రాసినదానితో కలిపి ఈ అభిప్రాయానికి రావడం జరిగింది. ఏశావుకు ఇక ఎన్నికలేదనీ, ఎన్నికైనవాడు కానందువలన దేవునికి చెందినవాడయ్యే దక్షత మరియు ఆయన చిత్తప్రకారం జీవించే స్థాయి లేవనీ ఈ వాక్య భాగాల్ని అపార్థంచేసుకోడం జరిగింది.

రిబ్కా గర్భంలో శిశువుల్ని దేవుడు గర్హించలేదనీ (త్రోసిపుచ్చలేదనీ), ఆయన ఆదికాండములో ప్రకటించినది దేవుని నిత్యరక్షణకు సంబంధించినది కాదనీ వీరు విస్మరిస్తున్నారు. రిబ్కా గర్భంలోని శిశువులు రెండు విభిన్న జాతుల్ని సూచిస్తున్నారు (లేక రెండు వేర్వేరు జాతులకు ప్రతినిధులుగా ఉన్నారు). వాగ్దాన

దేశాన్ని స్వాస్థ్యంగా పొందడంకొరకు, లోకంలో ఉన్న సమస్త వంశాల ప్రజలు ఆశీర్వాదం పొందేలాగా వారి నుండి లోకరక్షకుడైన యేసు రావడంకొరకు యాకోబు వంశస్థుల్ని దేవుడెన్నుకున్నాడు. ఏశావు వంశస్థులు ఎన్నికైనవారు కాకపోవడం దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానాల్ని కార్యాచరణలోపెట్టే వంశానికి వేరుగా ఉన్నవారు కావడమే తప్ప మరేదీ కాదు.

రోమా 9:11, 12 వచనాలు రక్షణ విషయంలో ఏశావు యాకోబుల్ని వైయక్తికంగా (వ్యక్తిగతస్థాయి) సూచించడం లేదు; పైగా ఈ అపార్థానికి, ఆసరాగా ఉండడంకొరకు, అంటే నిత్యరక్షణ విషయంలో ఏశావు యాకోబుల భవితవ్యాన్ని వారు తల్లిగర్భంలో ఉండగానే దేవుడు ముందుగానే నిర్హేతుకంగా నిర్ణయించాడనే తప్పు అభిప్రాయానికి ఆసరాగా ఉండడం కొరకు తదుపరి వచనాన్ని (రోమా. 9:13) తీసుకొనడం అసందర్భ ప్రస్తావనే అవుతుంది. దేవుడు మలాకీ 1:2, 3 వచనాల్లో "నేను యాకోబును ప్రేమించితిని ... ఏశావును ద్వేషించితిని" అని ఉన్నదాన్ని అపొస్తలుడు ఈ సందర్భంలో "యాకోబును ప్రేమించితిని, ఏశావును ద్వేషించితిని" (రోమా. 9:13) అని ప్రస్తావించడం జరిగింది.

మొదటగా మనమొక విషయాన్ని గుర్తించవలసిన అవసరం ఉంది: ప్రేమను ద్వేషాన్ని ఒకదాని తర్వాత మరొకదాన్ని చేర్చి చెప్పడంలో, "ద్వేషించడం" అనేది పలు సందర్భాల్లో "తక్కువగా ప్రేమించడం" అనే అర్థాన్నివ్వగా, "ప్రేమించడం" అనేది "ఎక్కువగా ప్రేమించడం" అనే అర్థాన్నిస్తుంది. ఆదికాండము 29:30–32 వచనాల్లో ఈ పదబంధాన్నుపయోగించిన విధానం ఈ వివరణకు శ్రేష్ఠమైన ఉదాహరణ. ఈ ప్రకటన నేపథ్యం (ఆది. 29:30–32 వచనాలు), హారానులో లాబాను క్రొత్త అల్లుణ్ణి మోసగించిన సందర్భంలోనిది. యాకోబు రాహేలును భార్యగా పొందడానికి ముందు, లేయాను భార్యగా పొందేలా మోసపోయాడు. "అతడు లేయాకంటె రాహేలును బహుగా ప్రేమించి" (29:30) అని వాక్యభాగం చెబ్తోంది. అంటే యాకోబు లేయాను "ప్రేమించాడని", అయితే రాహేలును "ప్రేమించినంతగా" ఆమెను ప్రేమించలేదని ఈ వచనంలోని సూచితార్థం. "లేయా ద్వేషింపబడుట యెహోవా చూచి" (29:31) అని రచయిత ప్రస్తావించాడు. "ద్వేషించు" అనే అర్థాన్నిచ్చే שָׂנֵא (*śane'*) అనే హెబ్రీ పదానికి "ద్వేషించడమే" అక్షరార్థమైనప్పటికీ, ఇది యాకోబుకు లేయాపట్ల శత్రుత్వంగానీ పగ గానీ ఉన్నట్టుగా స్పష్టమైన అర్థాన్ని చూపించడంలేదు. ఇది కేవలం యాకోబు రాహేలును ప్రేమించి నంతగా లేయాను ప్రేమించలేదని చెబ్తోంది. తదుపరి వచనంలో, లేయా యాకోబుకు కుమారుణ్ణి కనినప్పుడు ఆమె "నా పెనిమిటి నన్ను ప్రేమించును గదా" అని తలంచింది (29:32), అంటే, యాకోబు తనను రాహేలుకంటె ఎక్కువగా ప్రేమిస్తాడని కోరుకుందని దీని అర్థం.[26]

రెండవదిగా, మనం అర్థంచేసుకొనవలసిన విషయం, మలాకీ 1:2, 3 వచనాల్లోని ప్రకటన ఏశావు యాకోబులకు వైయక్తికంగా (వ్యక్తిగత స్థాయిలో) సంబంధించింది కాదు. కచ్చితంగా ఇది వారి విషయంలో నిత్యత్వానికి సంబంధించిన

భవితవ్యం కాదు. ప్రతిగా ఇది ఎదోమీయుల మీదకు వచ్చిన దేవుని తీర్పుకు సంబంధించినది; క్రీస్తు పూర్వం అయిదవ శతాబ్దంలోను నాల్గవ శతాబ్దంలోను (ఏశావు యాకోబుల కాలం నాటికి సుమారు పదమూడు వందల సంవత్సరాల తర్వాత) అరబ్బు తెగల్లోని నెబాతీయులు ఏశావు వంశస్థులు నివసించిన ప్రాంతాలనుండి వారిని తరిమికొట్టడం జరిగింది. మలాకీ ప్రవక్త ఈ మాటల్ని వ్రాసేటప్పటికి ఈ ప్రక్రియ దాదాపుగా పూర్తి అయిపోయింది; ఎలాగంటే, "ఏశావును ద్వేషించి అతని పర్వతములను పాడుచేసి అతని స్వాస్థ్యమును అరణ్యమందున్న నక్కల పాలు చేసితిని" (మలాకీ. 1:3) అని యెహోవా సెలవిచ్చాడు. ఎదోమీయులు తాము పూర్తిగా నాశనమయ్యామని గ్రహించిన తర్వాత, "పాడైన మన స్థలములను మరల కట్టుకొందము రండని" అనుకొనడం గురించి వాక్యభాగం తెలియజేస్తోంది; అయితే యెహోవా ఇది నిరుపయోగమైన ప్రయత్నమనీ, ఒక వేళ వారు కట్టుకున్నప్పటికీ తాను మరల పడద్రోస్తానని హెచ్చరించాడు (మలాకీ 1:4).

ఈ కవల పిల్లల జీవితాల్లో జరగబోయే సంఘటనల గురించి ముందుగా తెలిపే వాక్యభాగం, వారు పుట్టినప్పుడు చిన్నవాడు (యాకోబు) పెద్దవాడి (ఏశావు) మడిమె పట్టుకొని బయటికి వచ్చాడని తెలిపిన ఒకే ఒక వాక్యభాగం మాత్రమే (25:26). మడిమె పట్టుకోడమనే భావన లేక వంచనతో ఒకరిని పదవీభ్రష్టున్ని చేసి ఆ వ్యక్తి స్థానాన్ని పొందడమనే భావన, తదుపరి కాలంలో ఏశావు ఆకలితో ఉండడాన్ని చూచిన యాకోబు అతనికి ఒక గిన్నెడు వంటకాన్నివ్వడానికి అతను తన జ్యేష్ఠత్వం అమ్మివేసేలా బేరం కుదుర్చుకొని ఏశావు ఆకలిని తన కనుకూలంగా మలచుకున్న తీరును స్వభావాన్ని ముందుగా తెలియజేసిన ప్రవచనాత్మకమైన సూచన (25:27–34). యాకోబు అతని తల్లి ఇద్దరూ కలిసి ఇస్సాకును మోసగించి అతని నుండి ఆశీర్వాదాన్ని పొందిన సందర్భంలో ఈ సూచన మరోసారి స్పష్టంగా నెరవేరింది. ఈ ఆశీర్వాదం సాధారణంగా జ్యేష్ఠుడికి చెందుతుంది, అయితే దృష్టిమాంద్యం ఉన్న తన తండ్రిని యాకోబు తానే ఏశావునని చెప్పి మోసగించాడు (27:1–40). యాకోబు మరోసారి తన అన్న మడిమె పట్టుకున్నాడు.

ఏశావు యాకోబుల గురించి ప్రస్తావించే లేఖనభాగాలు ఏ ఒక్కరి రక్షణ గురించి గానీ లేక అధిక్షేపణ (ఖండన) గురించి గానీ నిర్హేతుకమైన (నిర్నిబంధమైన) వ్యక్తిగత ఎన్నికను తెలియజేయడం లేదు; అయితే అలా తెలియజేస్తున్నట్టుగా పలు సార్లు వ్యాఖ్యానించడం జరుగుతోంది. పాత నిబంధనలో దేవుడు తన ఉద్దేశాల్ని కార్యరూపంలో పెట్టడంకొరకు అబ్రాహాము ఇస్సాకు యాకోబు దావీదు మొదలైనవారి నెన్ను కున్నాడు (నెహెమ్యా 9:7; కీర్తనలు 89:3). పాత నిబంధనలోని ఇశ్రాయేలు (ద్వితీ. 14:2; 1 దిన. 16:13; కీర్తన. 105:6), క్రొత్త నిబంధనలోని క్రీస్తు శరీరం అయినటువంటి సంఘం (ఎఫెసీ. 1:3–11; 1 పేతురు. 1:1, 2; 2:9) వంటి సంస్థాగత వ్యవస్థల విషయంలో కూడా వాస్తవంగా ఉన్నదిదే. దేవుడు జగత్పునాది వేయక మునుపే క్రైస్తవుల్ని వైయక్తికంగా, అంటే విడి విడిగా ఒక్కొక్క వ్యక్తిని నిర్హేతుకంగా

(నిర్నిబంధంగా) ఎన్నుకోలేదు; ప్రతిగా ఆయన వారిని సమష్టిగా (క్రీస్తులో ఎవరు నిలిచి ఉంటారో వారిని, అంటే సంఘాన్ని) ఎన్నుకున్నాడు. “కాలము పరిపూర్ణమైనప్పుడు” (గలతీ. 4:4, 5) వీరిని విమోచించాలని దేవుడు ఉద్దే శించాడు. ఎన్నికైన ఈ సమష్టి బృందంలో ఒక భాగంగా ఉండడమనేది వైయక్తికమైన ఎంపిక, అంటే ఎవరికి వారు తమ స్వంతనిర్ణయం ప్రకారం క్రీస్తును అంగీకరించడం మీద, లేక ఆయనను తృణీకరించడంమీద ఆధారపడి ఉంటుంది. ప్రస్తుత కాలంలో మన కొక ఆజ్ఞ ఇవ్వబడింది; సువార్త సందేశాన్ని విని, సువార్తను నమ్మి, మన పాపాల విషయంలో పశ్చాత్తాప పడి (మారుమనసు పొంది), క్రీస్తును దేవుని కుమారుడిగా విశ్వాసంతో ఒప్పుకొని, పాపక్షమాపణ కొరకు బాప్తిస్మం పొందాలనేదే ఈ ఆజ్ఞ (అపొ. 2:36–41; మరియు మార్కు 16:15, 16; రోమా. 6:3–6; ఎఫెసీ. 1:13; కొలొస్సి. 2:11–13; 1 పేతురు 1:18–23 చూడండి).

బైబిల్ అంతటా, రక్షణ అనేది ఎప్పటికీ విశ్వాసం విధేయతలమీద ఆధారపడినదే. ఎన్నికైనవారు తిరుగుబాటుతనంతో (అవిధేయతతో) దేవుణ్ణి విడిచిపెట్టి, పశ్చాత్తాపపడకుండా ఉన్నట్లయితే, వారు ఈ క్రింది పర్యవసానాల్ని అనుభవించక తప్పదని దేవుడు హెచ్చరించాడు: (1) వేరుచేయబడి అగ్నిలో పడవేయబడ డం (యోహాను. 15:1–6); (2) దేవుని పట్ల (హెబ్రీ. 3:12), క్రీస్తుపట్ల (గలతీ. 5:1–4) ఉన్న విశ్వాసం నుండి వెనుతిరిగి భ్రష్టత్వంలో పడిపోవడం; (3) దేవుని విశ్రాంతిలో ప్రవేశించకపోవడం (హెబ్రీ. 4:1–11); మరియు (4) పిలుపు మరియు ఎన్నిక అపాయంలో పడడం (2 పేతురు. 1:10 చూడండి; KJV).

*ముగింపు:* దేవుడు మనుషుల కనుగ్రహించిన ఆశీర్వాదాలు వారి జీవితాల్లోను వారి భవిష్య తరాల్లోను కొనసాగవచ్చు, లేదా అవి శాపాలుగా కూడా మారవచ్చు. ఈ ఫలితార్థం గానీ లేక పర్యవసానం గానీ ఆశీర్వాదాలందుకున్నవారి ప్రతిప్రత్యుత్తరముమీద ఆధారపడి ఉంటుంది. క్రీస్తులో ఉన్న ప్రతి ఆధ్యాత్మిక ఆశీర్వాదం (ఎఫెసీ. 1:3), మనకు “అనాదికాలముననే” (2 తిమోతి. 1:9) ఏర్పాటైన దేవుని యోచన (ఉద్దేశం, ప్రణాళిక). ఘనమైన ఈ ఆశీర్వాదాల ద్వారా మనం మేలు పొందేలా క్రీస్తులో విశ్వాసం కలిగి జీవిద్దాం.

## ఆధ్యాత్మిక ఓర్పు (25:19–26)

చరిత్రలో ఆదినుండి ఇప్పటివరకు, కఠినశ్రమ లెదుర్కొంటున్న దేవుని ప్రజలు “ఇవెందుకు వస్తున్నాయి?” అని అడుగుతూ జవాబుల కొరకు మొరపెడ్తూనే ఉన్నారు. అయినా గానీ, చాలా మటుకు, పరలోకం నుండి ఏ జవాబూ రాలేదు. విశ్వసించిన ప్రజలకు దేవునినుండి కావలసినది “ఎందుకు” అనే ప్రశ్నలకు జవాబులు కాదు గానీ, కఠినశ్రమల్లో “ఎలా” ప్రతిస్పందించాలో విశదపర్చే జ్ఞానమేనని గ్రహించవలసి ఉండడమే బహుశా ఇందుకు కారణంకావచ్చు (యాకోబు. 1:5). బహుశా ఈ క్రింది ప్రశ్నలు సముచితంగా ఉంటాయేమో: “ప్రభువా,

నేను దీనినుండి ఏం నేర్చుకోవాలని నీవు కోరుకుంటున్నావు"; "ఇది నన్నెలా ఇంకా ఎక్కువగా వృద్ధి చేయగలదు (మెరుగుపర్చగలదు); "ఈ అనుభవాన్ని నీ మహిమకొరకు నేనెలా ఉపయోగించాలి?"

ఇది మనం ఇటువంటి సరైన ప్రశ్నలడిగినట్లయితే దేవుడు మనకు వినబడేటట్టుగా మాట్లాడి జవాబిస్తాడని సూచించదు గానీ, మనం సరైన దృక్పథాన్ని పెంపొందించుకొనడంలోను, మరియు కష్టాలెదురైనప్పుడు వాటినెదుర్కొనేలా మనం సరైన మార్గంలో నడవడంలోను నిశ్చయంగా మనకు తోడ్పడగలదు. మనమీద మనమే జాలిపడుతూ ఉన్నట్లయితే, లేక శ్రమలెదురైనందుకు మనం దేవునితో ఎడముఖంగా ఉన్నట్లయితే శ్రమలు మనల్నింకా ఎక్కువగా వినాశనానికి నడిపిస్తాయి; అయితే మనం సరైన విధంగా స్పందించినట్లయితే అవి మనలో ఓర్పును అంటే నిలకడతనాన్ని పెంపొందిస్తాయి. యేసు సహోదరుడైన యాకోబు, "నా సహోదరులారా, మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి, మీరు నానావిధములైన శోధనలలో పడునప్పుడు, అది మహానందమని యెంచుకొనుడి" అని చెప్పాడు (యాకోబు 1:2, 3).

దేవుడు మన విశ్వాసాన్ని పరీక్షచేయడానికి శ్రమల ననుమతిస్తాడు; ఆయనిలా చేయడంద్వారా, మనం ఆధ్మాత్మిక బలాన్ని ("ఓర్పు") పెంపొందించుకోవాలని కోరుకుంటున్నాడు. బరువులు పైకి ఎత్తే క్రీడా కారులకు (వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులు) బహుశా ఈ భావన బాగా అర్థమవుతుంది; వారికి ఉపయుక్తమైన వైచిత్రి: "నొప్పి లేకపోతే లాభం లేదు." కాబట్టి కండరాలు బలంగా ఉండాలంటే, నొప్పిగా ఉన్నా సరే కండరాలు గట్టిపడేలా వ్యాయామం చేయక తప్పదు.

ఆధ్యాత్మిక బలం విషయంలో కూడా ఇదే నియమం. అందుకే ప్రభువు తన శిష్యులతో వారు శ్రమలెదుర్కొనవలసి ఉంటుందని చెప్పాడు. వారికెదురు కాబోయే శ్రమలు: కుటుంబసభ్యులు స్నేహితులు తృణీకరించడం, ద్వేషం, హింస, చివరకు శత్రువుల చేతుల్లో మరణం; అయితే ఆయన "ఇది సాక్ష్యార్థమై మీకు సంభవించును" (లూకా 21:13) అని చెప్పాడు. అంటే, మనం దేవుని సర్వాంగ కవచంలో భాగమైన "ఆత్మ ఖడ్గము" మరియు "విశ్వాసమను డాలు" (ఎఫెసీ. 6:16, 17) అనే ఉపకరణాల్ని వాడినట్లయితే శ్రమలు హింసలు మనం బలంగా ఎదిగే అవకాశాన్ని కల్పిస్తాయని అర్థం. దేవుణ్ణి విశ్వసిస్తూ ఆధ్యాత్మిక యుద్ధోపకరణాల్ని ఉపయోగించుకున్నట్లయితే శ్రమల్ని హింసల్ని "సాక్ష్యం"గా మార్చే జీవితాన్ని, చివరకు అవసరమైతే యేసు లాగా మరణించడానికి శక్తినిచ్చే బలమైన కండరాల్ని (ఆధ్మాత్మిక బలాన్ని) పెంపొందించుకొనగలం. ఈ విషయంలో రెండు శక్తిమంతమైన ఉదాహరణలు: (1) రాళ్లతో కొడుతున్నప్పటికీ స్తెఫను సాక్ష్యం మరియు ప్రార్థన (అ.కా. 7:57–60); మరియు (2) ఫిలిప్పీలో పౌలును సీలను అన్యాయంగా కొట్టి చెరసాలలో బంధించి నప్పుడు వారు స్తుతిగీతాలు పాడడం (అ.కా. 16:19–34).

రిబ్కా విషయంలో ఆమెను కలవరపర్చిన ప్రతికూలత బయటినుండి రాలేదు

గానీ ఆమెకు చాలా కాలం పిల్లలు కలగక పోవడంవలన ఆమె లోలోపల ఉన్న అశక్తత అసమర్థత ఎక్కువగా కలవరపెట్టాయి. ఆమె తనకు భర్త కాబోయే వ్యక్తిని కలుసుకొనేందుకు కనాను నుండి బయటికి వచ్చేటప్పుడు ఆమె కుటుంబం "మా సహోదరీ, నీవు వేల వేలకు తల్లి వగుదువు గాక, నీ సంతతివారు తమ పగవారి గవినిని స్వాధీనపరచు కొందురు గాక" (24:60) అని ఆశీర్వదించడం బహుశా ఆమె గుర్తు చేసుకొని ఉండవచ్చు. ఏదేమైనా, వివాహమైన ఇరవై సంవత్సరాల తర్వాత కూడా తానింకా గొడ్రాలుగానే ఉన్నందుకు రిబ్కా బహుశా దేవుడు తనతో కఠినంగా వ్యవహరిస్తున్నాడని అనుకొని ఉండవచ్చు. ఆమె తన వైఫల్యం (వంధ్యత్వం) గురించి దేవుణ్ణి అడగడానికి అభిమానపడిందా? లేక భయపడిందా? ఆమె దీనిగురించి ఎన్నడూ స్వంతంగా దేవుణ్ణి ప్రార్థించలేదా? ఆమె తన పక్షాన దేవుణ్ణి వేడుకొనమని తన భర్తను అడగడం అవమానంగా భావించి ఉండవచ్చా? ఈ ప్రశ్నలకు వాక్యభాగంలో జవాబులు లభించవు. ఏదేమైనప్పటికీ, చివరకు రిబ్కా తన చింతలన్నిటినీ తన భర్త ప్రార్థన ద్వారా యెహోవాకు అప్పగించింది (1 పేతురు 5:7); ఫలితం, ఆమె గర్భం దాల్చి కవల పిల్లలకు జన్మనిచ్చేలా దేవుడు ఆమెకు అనుకూలమైన జవాబునిచ్చాడు.

---

సూచనలు

[1]యోబు గురించి, "తూర్పు దిక్కు జనులందరిలో అతడే గొప్పవాడుగా నుండెను" (యోబు. 1:3) అనే వర్ణన, అతను అతని స్నేహితులు కనాను దేశానికి తూర్పువైపున బహుశా పశ్చిమ అరేబియా శివారు ప్రాంతంలో నివసించారని సూచిస్తోంది. [2]బహువచన కృదార్థాల ఉపయోగం వ్యక్తుల్నికాక తెగలనే సూచిస్తోంది, ఇది జాతుల పట్టికలో అంటే వంశావళుల వివరాల్లో కూడా కనబడుతోంది (10:4, 13, 14). [3]Gordon J. Wenham, *Genesis 16—50*, Word Biblical Commentary, vol. 2 (Dallas: Word Books, 1994), 159. [4]*The Code of Hammurabi* 171. [5]ఆ విధంగానే, తమ తండ్రియైన ఇస్సాకును సమాధిచేయడానికి ఏశావు యాకోబులిద్దరూ కలిసివచ్చారు (35:29). [6]మహలతు మరియు బాశెమతు అనే పేర్లు బహుశా ఒకే స్త్రీని సూచిస్తుండవచ్చు (36:2, 3 వివరణలు చూడండి). [7]Mark J. Fretz, "Adbeel," in *The Anchor Bible Dictionary*, ed. David Noel Freedman (New York: Doubleday, 1992), 1:70. [8] హెబ్రీ లేఖనప్రతిలో "దూమా" అని ఉంది; అయితే గ్రీకు లేఖనప్రతి ననుసరించిన NASB "ఎదోము" అనే పేరును, తదుపరి వచనంలో ఉన్న "శేయీరు" అనే పేరుకు సమాంతరంగా ఉపయోగించడం జరిగింది (చూడండి యెషయా 21:11, 12; LXX). [9]Victor P. Hamilton, *The Book of Genesis: Chapters 18—50*, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1995), 172. [10]A. Leo Oppenheim, trans., "Babylonian and Assyrian Historical Texts," in *Ancient Near Eastern Texts: Relating to the Old Testament*, 3d ed., ed. James B. Pritchard (Princeton, N.J.: Princeton University Press, 1969), 283–84.

[11]Ludwig Koehler and Walter Baumgartner, *The Hebrew and Aramaic Lexicon of the Old Testament*, study ed., trans. and ed. M. E. J. Richardson (Boston: Brill, 2001), 1:374. [12]Mishnah *Aboth* 5.21; Talmud *Sanhedrin* 76b. [13]R. Albertz, "עתר," in *Theological Lexicon of the Old Testament*, trans. Mark E. Biddle, ed. Ernst Jenni and Claus Westermann (Peabody, Mass.: Hendrickson Publishers, 1997), 2:962. [14]William White, "רָצַץ," in *TWOT*, 2:860. [15]ఆదికాండములోని కాలక్రమానుసారం, అబ్రాహాము మెల్కీసెదెకును కలుసుకున్నప్పుడు బహుశా అతనికి (అబ్రాహాము) తక్కువలో తక్కువగా ఎనభై సంవత్సరాల వయసు ఉంటుంది (12:4; 14:18–20; 16:3 చూడండి). దాదాపు ఇరవై సంవత్సరాల తర్వాత, ఇస్సాకు జన్మించాడు (21:5); రిబ్కా ఏశావు యాకోబులకు జన్మనిచ్చినప్పుడు ఇస్సాకు వయసు అరవై సంవత్సరాలు (25:26). మెల్కీసెదెకును షాలేము రాజుగా దేవుని యాజకుడిగా ప్రస్తావించిన సందర్భం తర్వాత సుమారు ఎనభై సంవత్సరాలు గడిచాయని దీని అర్థం (యెరూషలేము; కీర్తన. 76:2). మెల్కీసెదెకు ఇంకా సజీవుడై ఉన్నాడా లేడా, లేక "సర్వోన్నతుడైన దేవునికి యాజకుడు"గా అతని కుమారుడెవరైనా అతని యాజకసేవను కొనసాగించి ఉంటారా అనేది కేవలం ఊహ మాత్రమే. [16]See Leonard J. Coppes, "אַדְמוֹנִי," in *TWOT*, 1:11–12. [17]Ibid. [18]John T. Willis, *Genesis*, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1979), 318–19. [19]ఏశావు "మోటుతనమున్న అనాగరికుడు" అని వర్ణించబడెను. (Kenneth A. Mathews, *Genesis 11:27–50:26*, The New American Commentary, vol. 1B [Nashville: Broadman & Holman Publishers, 2005], 391.) [20]యాకోబు "సభ్యతా సంస్కారాలున్న మనిషి" అనే గుణపైచిత్రి కనబడుతోంది. (K. Koch, "תמם," in *Theological Lexicon of the Old Testament*, 3:1427.)

[21]Theophile J. Meek, trans., "Mesopotamian Legal Documents," in *Ancient Near Eastern Texts*, 219–20. [22]Hamilton, 184. [23]Bruce K. Waltke, "בָּזָה," in *TWOT*, 1:98. [24]בָּחִיר (*bachir*) అనే హెబ్రీ పదం, ఈ పదానికి ἐκλεκτός (*eklektos*) అనే గ్రీకు సమానార్థకం "ఎంపిక" యైన లేక "ఎన్నిక" యైన వ్యక్తిని లేక జాతిని సూచిస్తోంది. (John N. Oswalt, "בָּחִיר," in *TWOT*, 1:100–1; and Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature*, 3d ed., rev. and ed. Frederick William Danker [Chicago: University of Chicago Press, 2000], 306.) [25]"పితరులు" అనే పదం దేవుడు ఎన్నుకున్నవారిని సమష్టిగా (సాముదాయికంగా) సూచిస్తోంది (అపో. 13:17 చూడండి). [26]"ప్రేమ" గురించి, "ద్వేషం" గురించి ఇటువంటి భాషాప్రయోగం మత్తయి 10:37ను లూకా 14:26తో పోల్చి చూచినప్పుడు కనబడుతుంది.